



'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

# అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575



| మేడ్చల్-మల్కాజ్‌గిరి | సోమవారం | 14.07.2025 | సంపుటి : 2 | సంచిక :161 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Saturday | 14.07.2025 | volume : 2 | Issue : 161 | Pages : 8 | Cost : 2/- |



02

## ఘనంగా లష్కర్ బోనాలు

### ఉజ్జయినీ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్

సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి అమ్మవారి బోనాల ఉత్సవం ఆదివారం ఘనంగా సాగింది. అమ్మవారి జాతరతో లష్కర్ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉదయం 11.40 గంటలకు ఆలయానికి చేరుకోగా.. అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ముఖ్యమంత్రికి వేద మంత్రాలతో ఆశీర్వచనాలు అందించారు. సీఎం వెంట మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

# ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై జాగృతి కార్యకర్తల దాడి

### మేడిపల్లిలోని క్యూ న్యూస్ కార్యాలయంలో ఫర్నిచర్, కిటికీలు ధ్వంసం

- గన్‌మెన్ కాల్పులు.. ఇరు వర్గాలపై కేసులు.. జాగృతి కార్యకర్త ఒకరికి ఆస్పత్రిలో చికిత్స
- మల్లన్న సహా పలువురికి స్వల్పగాయాలు
- పోలీసుల అదుపులో నలుగురు







హైదరాబాద్, జూలై 13 : ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌కుమార్ కార్యాలయంపై జాగృతి కార్యకర్తలు దాడి చేశారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై మల్లన్న చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహించి ఈ దాడికి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో 30 మంది జాగృతి కార్యకర్తలు బోడుప్పల్‌లోని తీన్మార్ మల్లన్నకు చెందిన క్యూ న్యూస్ కార్యాలయానికి వచ్చారు. 'జై కవితక్క' అంటూ నినాదాలు చేస్తూ మల్లన్న క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆఫీసులోని అద్దాలు, కుర్చీలను ధ్వంసం చేశారు. వారిని అడ్డుకునేందుకు క్యూన్యూస్ సిబ్బంది, మల్లన్న గన్‌మెన్ ప్రయత్నించారు. ఈ క్రమంలో వారి మధ్య తీవ్ర తోపులాట జరుగగా.. పలువురికి గాయాలయ్యాయి. కార్యాలయంలో మల్లన్న కూర్చున్న చాంబర్‌లోకి చొచ్చుకెళ్లేందుకు జాగృతి కార్యకర్తలు ప్రయత్నించగా.. గన్‌మెన్ అడ్డుకున్నారు. అయినా వారు వెనక్కి తగ్గకపోవడంతో కాల్పులు జరిపారు. దీంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఏం జరుగుతుందో కొద్దిసేపు ఎవరికీ అర్థం కాలేదు. దాడి అనంతరం క్యూ న్యూస్ కార్యాలయంలో ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

మిగతా 2 లో


02

## హైకోర్టులో 2.36 లక్షల పెండింగ్ కేసులు

హైకోర్టు జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్


02

## ముడిచమురు వ్యాగన్లలో చెలరేగిన మంటలు

రూ.80 కోట్ల విలువైన ఇంధనం అగ్నికి ఆహుతి


02

## అన్ని కోచ్‌లకు సీసీకెమెరాలు..

రైల్వేశాఖ కీలక నిర్ణయం



03

## ఇక దేశవ్యాప్తంగా ఓటరు జాబితాల సమగ్ర సవరణ?


03

## నీటి కోసం ఎదురుచూస్తున్న వారిపై కాల్పులు

గాజాలో 19 మంది మృతి


03

## ఏమిటీ ఈ-వీసా..

జులై 15 నుంచి యూకేలో అమలు..

## కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

### మంచిర్యాల జిల్లాలో సౌర విద్యుత్తు ప్లాంటు పనుల ప్రారంభం



మంచిర్యాల, జూలై 13 : ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని దశల వారీగా పూర్తిస్థాయిలో అమలు చేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం రెబ్బెనపల్లి గ్రామంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో రూ.3 కోట్లతో ఏర్పాటు చేయనున్న 1 మెగావాట్ సామర్థ్యం కలిగిన సౌర విద్యుత్తు ప్లాంటు పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే లక్ష్యంతో తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కుల, మతాలకు అతీతంగా పేదింటి పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో ఉచిత విద్య అభ్యసించేందుకు వీలుగా రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టామన్నారు.

మిగతా 2 లో

పేరెంట్స్ మీటింగ్ సందర్భంగా తమ పిల్లల బాగోగులు తెలుసుకునేందుకు వసతి గృహానికి వచ్చిన తల్లిదండ్రులు భోజనంలో పురుగులు చూసి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పిల్లలకు రోజూ ఇలాంటి భోజనమే పెడుతున్నారా అంటూ ప్రశ్నించారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం సిరిపురంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో జరిగింది.


02

## పేరెంట్స్ మీటింగ్ రోజే అన్నంలో పురుగులు

- తమ పిల్లలకు రోజూ ఇలాంటి భోజనమే పెడుతున్నారా.. అంటూ సిబ్బందిపై విద్యార్థుల తల్లిదండ్రుల ఆగ్రహం
- వికారాబాద్ జిల్లా సిరిపురం ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఘటన


02

## శ్రీశైలం ప్రాజెక్టుకు తగ్గిన ఇన్‌ఫ్లో

### 2 రోజుల్లో మూతపడనున్న గేట్లు!

- మేడిగడ్డకు కొనసాగుతున్న వరద
- బ్యారేజీకి 2.89 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- నెలన్నరలో 256 టీఎంసీలు సముద్రం పాలు

# నేటి నుంచే కొత్త రేషన్‌కార్డులు

### సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో పంపిణీ చేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి

### సాయంత్రం బహిరంగ సభలో ప్రసంగం

రాష్ట్రంలో సోమవారం నుంచే కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం కానుంది. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరిలో సీఎం రేవంత్‌రెడ్డి ఈ పంపిణీకి శ్రీకారం చుట్టనున్నారు. అనంతరం అక్కడే నిర్వహించనున్న బహిరంగ సభలో సీఎం ప్రసంగిస్తారు. ఈ మేరకు సీఎం పర్యటన, సభ కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. రేషన్‌కార్డుల పంపిణీ, బహిరంగ సభ నేపథ్యంలో ఆదివారం సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ భేటీ అయి చర్చించారు.


02


02

## కవితపై మల్లన్న వ్యాఖ్యల్ని ఖండిస్తున్నాం

- ఆయన కార్యాలయంపై దాడి చట్ట వ్యతిరేకమే..
- చట్టపరిధిలో అందరూ పనిచేసుకోవాలి: మహేశ్ గౌడ్

అక్షర రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక



## ఘనంగా లష్కర్ బోనాలు

**హైదరాబాద్:** సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి అమ్మవారిని దర్శించుకునేందుకు హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ రాగా ముఖ్యమంత్రి ఆయనను ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. వేకువజామున 4.10 గంటలకు హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సతీ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు, తొలిబోనం సమర్పించారు. రాష్ట్రంలో మంచి వర్షాలు కురిసి పాడిపంటలతో రైతులంతా సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు మంత్రి తెలిపారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అమ్మవారికి బోనం సమర్పించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మంత్రి సీతక్క, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, పద్మారావు, దానం నాగేందర్ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం బోనాల సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ బంజారాహిల్స్‌లోని అధికారిక నివాసంలో ఇచ్చిన విందుకు సీఎం రేవంత్‌రెడ్డి, శాసనసభాపతి గడ్డం ప్రసాద్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు హాజరయ్యారు.

## కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లిలో పూరించిన శంఖారావం, నిర్వహించిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రల ద్వారానే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి బీజాలు పడిన విషయాన్ని తమ ప్రభుత్వం ఎప్పటికీ మరిచిపోదన్నారు. అంతకు ముందు లక్సెట్టిపేటలో రూ.11.53 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రి భవనాన్ని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖలతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. మంచిర్యాల నగరపాలక సంస్థ పరిధిలోని వేంపల్లిలో ఇండస్ట్రియల్, ఐటీ పార్కు భూమి పూజలో పాల్గొన్నారు.



## హైకోర్టులో 2.36 లక్షల పెండింగ్ కేసులు

### హైకోర్టు జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్

**ఓదెల:** హైకోర్టులో నేటికి 2.36 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, న్యాయమూర్తుల సంఖ్య పెరుగుతున్న కొద్దీ కేసుల సంఖ్య కూడా పెరుగుతోందని రాష్ట్ర హైకోర్టు జడ్జి, పెద్దపల్లి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దూరభారం తగ్గించేందుకు ఐదు వందలకుపైగా పెండింగ్ కేసులున్న చోట కొత్త కోర్టును ఏర్పాటు చేసుకునే వెసులుబాటు ఉందని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా ఓదెలలో ఆదివారం నూతనంగా జూనియర్ సివిల్ జడ్జి, జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ కోర్టును ప్రారంభించి మాట్లాడారు. ఓదెలలో నూతన కోర్టు ఏర్పాటు మనందరి అదృష్టమని, పొత్కపల్లి, కాల్వశ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధికి సంబంధించి 490 సివిల్, 807 క్రిమినల్ కేసులతో ఇక్కడి కోర్టును ప్రారంభించామని చెప్పారు. హైకోర్టు జడ్జిలు జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్, జస్టిస్ ఈవీ వేణుగోపాల్, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు, జిల్లా సెషన్స్ జడ్జి సునీత కుంచల, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు కాసుగంటి లక్ష్మణ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. నూతన కోర్టులో జడ్జి డి.గణేశ్ తొలిసారిగా విధులు నిర్వర్తించారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, సీపీ అంబర్ కిశోర్‌ఝా న్యాయమూర్తులకు స్వాగతం పలికారు.



## ముడిచమురు వ్యాగన్లలో చెలరేగిన మంటలు

- రూ.80 కోట్ల విలువైన ఇంధనం అగ్నికి ఆహుతి
- తమిళనాడులోని పెరియకుప్పం వద్ద గూడ్సు రైలు పట్టాలు తప్పడంతో ఘటన

**చెన్నై:** ముడిచమురు వ్యాగన్లతో వెళుతున్న గూడ్సు రైలు అగ్నిప్రమాదానికి గురైంది. చెన్నై తండయారుపేటలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్లాంట్ నుంచి ముడిచమురుతో కూడిన 52 వ్యాగన్లతో ఓ గూడ్స్ రైలు శనివారం అర్ధరాత్రి వేలూర్ సమీప జోలార్‌పేటకు బయలుదేరింది. ఒక్కో వ్యాగన్‌లో 27వేల లీటర్ల ముడిచమురు ఉంది. ఆదివారం వేకువజామున 5.10 గంటలకు తిరువళ్లూరు సమీప పెరియకుప్పం వద్ద రైలు వెళుతుండగా 17 వ్యాగన్లు పట్టాలు తప్పాయి. దీంతో పట్టాలు, చక్రాల మధ్య ఏర్పడిన రాపిడితో నిప్పురవ్వలు పుట్టి వ్యాగన్లకు మంటలు అంటుకున్నాయి. ప్రమాదాన్ని గుర్తించిన లోకోపైలట్ వెంటనే రైలును ఆపేశారు. గాలి బలంగా వీచడంతో మంటలు ఇతర వ్యాగన్లకు వ్యాపించాయి. రైల్వే అధికారులు, అగ్నిమాపక సిబ్బంది, అరక్కోణం నుంచి వచ్చిన రెండు జాతీయ విపత్తు స్పందన బృందాలు.. సుమారు 10 గంటలు శ్రమించి మంటలను అదుపు చేశాయి. మిగతా 35 వ్యాగన్లను స్థానికుల సాయంతో దూరంగా నెట్టడంతో మరింత నష్టం తప్పింది. ప్రమాదంలో రూ.80 కోట్ల విలువైన 11.90 లక్షల లీటర్ల ముడిచమురు అగ్నికి ఆహుతైంది. ప్రమాదం కారణంగా తిరువళ్లూరు–అరక్కోణం మార్గంలో రైళ్ల రాకపోకలను నిలిపేశారు. తమిళనాడు మంత్రి నాజర్, జిల్లా కలెక్టర్ ప్రతాప్, ఎస్పీ శ్రీనివాస పెరుమాల్ ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు.

## ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై జాగృతి కార్యకర్తల దాడి

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు చెందిన క్యూ న్యూస్ కార్యాలయం వద్ద తెలంగాణ జాగృతి కార్యకర్తలు ఆదివారం చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎమ్మెల్సీ కవితను ఉద్దేశించి ఇటీవల జహీరాబాద్‌లో నిర్వహించిన బీసీ నేతల సమావేశంలో తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ జాగృతి కార్యకర్తలు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా మేడిపల్లిలోని క్యూ న్యూస్ కార్యాలయం పైకి వచ్చారు. సిబ్బందిని తోసివేసి ఫర్నిచర్, కిటికీలు ధ్వంసం చేశారు. ఈ సమయంలో మల్లన్న తన ఛాంబర్లోనే ఉండగా.. తలుపులు పగులగొట్టి లోపలికెళ్లి దాడి చేశారు. ఈ క్రమంలో ఆయన కుడిచేతికి స్వల్ప గాయమైంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో గన్‌మేన్ శ్రీనివాస్ తన తుపాకీతో ఆరు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపారు. విషయం తెలుసుకొని మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ ఆర్.గోవిందరెడ్డి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకోగా అప్పటికే ఆందోళనకారులు కొందరు పరారయ్యారు. జాగృతి కార్యకర్త సాయి చేతికి అద్దం గుచ్చుకుని గాయమవగా ఆసుపత్రికి తీసుకెళ్లారు. జాగృతి యాదాద్రి జిల్లా అధ్యక్షుడు సందుపట్ల సుజిత్‌రావు, ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షుడు అశోక్‌యాదవ్‌తోపాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మల్లన్నకు ఘట్‌కేసర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించారు. ‘నాపై దాడి చేయడమే కాకుండా.. నా గన్‌మేన్ చేతిలోని తుపాకీ లాక్కొని నన్ను కాల్చేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన మరో గన్‌మేన్ గాల్లోకి కాల్పులు జరిపారు. ఎమ్మెల్సీ కవిత తన ఉనికి కోసం బీసీ



నాయకత్వం మీద దాడి చేస్తే ఊరుకోం’ అని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ఇరువర్గాల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో కవిత, మల్లన్నలపై కేసులు నమోదైనట్లు మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి ఒక ప్రకటనలో తెలిపారు.

### మల్లన్న ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని సస్పెండ్ చేయాలి

తీన్మార్ మల్లన్న ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని సస్పెండ్ చేయాలని కోరుతూ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. మల్లన్నపై హత్యాయత్నం కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరుతూ డీజీపీ కార్యాలయంలో అదనపు ఐజీ(శాంతి భద్రతలు) రమణకుమార్‌కూ ఫిర్యాదు చేశారు. ‘ఈ ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలి. లేదంటే ఆయనే మల్లన్నతో మాట్లాడించారని భావించాల్సి ఉంటుంది’ అని ఈ సందర్భంగా కవిత పేర్కొన్నారు.

## నేటి నుంచే కొత్త రేషన్‌కార్డులు

- సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో పంపిణీ చేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- సాయంత్రం బహిరంగ సభలో ప్రసంగం

**హైదరాబాద్, జూలై 13:** రాష్ట్రంలో సోమవారం నుంచే కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం కానుంది. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరిలో సీఎం రేవంత్‌రెడ్డి ఈ పంపిణీకి శ్రీకారం చుట్టనున్నారు. అనంతరం అక్కడే నిర్వహించనున్న బహిరంగ సభలో సీఎం ప్రసంగిస్తారు. ఈ మేరకు సీఎం పర్యటన, సభ కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. రేషన్‌కార్డుల పంపిణీ, బహిరంగ సభ నేపథ్యంలో ఆదివారం సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ భేటీ అయి చర్చించారు. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో తిరుమలగిరిలోని సభా ప్రాంగణానికి చేరుకుంటారు. తొలుత కొత్త రేషన్‌కార్డుల పంపిణీని లాంఛనంగా ప్రారంభిస్తారు. అనంతరం సభలో ప్రసంగిస్తారు. తిరుమలగిరి తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో బహిరంగ సభకు ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. 11 చోట్ల పార్కింగ్‌ను సిద్ధం చేశారు. ఈ సభ కోసం కాంగ్రెస్ నేతలు భారీగా జన సమీకరణ చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే మందుల సామేలుతోపాటు మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు ఉమ్మడి నల్లగొండ, వరంగల్ జిల్లాల నుంచి కార్యకర్తలు, అభిమానులను తరలించేందుకు ఏర్పాట్లు చేసినట్టు తెలిసింది. రేవంత్ సీఎం హోదాలో తొలిసారి




సూర్యాపేట జిల్లాకు, తుంగతుర్తి నియోజకవర్గానికి వస్తుండటంతో ఆ ప్రాంతానికి ప్రత్యేకంగా నిధులు, వరాలు ఏమైనా ఇస్తారని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తుంగతుర్తిలో జూనియర్ కళాశాలకు భవన నిర్మాణం, వెలుగుపల్లి రుద్రమ్మ చెరువు రిజర్వాయర్‌గా మార్పు, కాల్వలు నిర్మించి దేవాదుల నీటి సరఫరా, డిగ్రీ కళాశాల, ఫైర్‌స్టేషన్, బస్‌డిపో, 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## కవితపై మల్లన్న వ్యాఖ్యల్ని ఖండిస్తున్నాం

- ఆయన కార్యాలయంపై దాడి చట్ట వ్యతిరేకమే..
- చట్టపరిధిలో అందరూ పనిచేసుకోవాలి: మహేశ్ గౌడ్

**హైదరాబాద్, జూలై 13:** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు గర్హనీయమని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. మహిళలను గౌరవించుకోవడం మన సంప్రదాయమని.. కవితపై మల్లన్న చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించాల్సిందేనని స్పష్టం చేశారు. అలాగే మల్లన్న కార్యాలయంపై దాడి చట్టవ్యతిరేకమని మండిపడ్డారు. చట్ట పరిధిలో అందరూ పనిచేసుకోవాలని ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు. మల్లన్న కార్యాలయంపై దాడి, గన్‌మెన్ కాల్పులు జరిపిన అంశాలపైన వచ్చిన ఫిర్యాదులపై చట్ట పరిధిలో విచారణ జరుగుతుందని తెలిపారు. బీసీ బిల్లు, రిజర్వేషన్లు అన్నీ కాంగ్రెస్ కృషి



ఫలితమేనని పునరుద్ఘాటించారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో ఇతరులు లబ్ధి పొందాలని చూడడం సమంజసం కాదని హితవు పలికారు.

## శ్రీశైలం ప్రాజెక్టుకు తగ్గిన ఇన్‌ఫ్లో

- 2 రోజుల్లో మూతపడనున్న గేట్లు!
- మేడిగడ్డకు కొనసాగుతున్న వరద
- బ్యారేజీకి 2.89 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- నెలన్నరలో 256 టీఎంసీలు సముద్రం పాలు

**నాగార్జునసాగర్/మహదేవపూర్, జూలై 13:** కృష్ణా నది వరద తగ్గుముఖం పట్టగా.. గోదావరికి మాత్రం కొనసాగుతోంది. కర్ణాటక, మహారాష్ట్రతో పాటు కృష్ణా నదీ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో శ్రీశైలం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో క్రమంగా తగ్గిపోయింది. జలాశయానికి ఆదివారం 73,586 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే వచ్చింది. ఒక గేటు ఎత్తి 27,296 కూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 68,382 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. రెండు రోజుల్లో గేట్లు మూసివేసే అవకాశం ఉంది. ప్రాజెక్టు పూర్తి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 206.09 టీఎంసీల నిల్వ ఉంది. జూరాల ప్రాజెక్టుకు 65 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, ఒక గేటు ద్వారా 6,823 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 36,035 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద నిలకడగా కొనసాగుతోంది.

దీంతో సాగర్ నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి 551.10 అడుగులకు చేరుకుంది. సాగర్ నుంచి జంటనగరాల తాగునీటి అవసరాల కోసం ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,650 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ఆలమట్టి ప్రాజెక్టుకు కూడా ఇన్‌ఫ్లో 69,084 క్యూసెక్కులకు తగ్గింది. నారాయణపూర్ ప్రాజెక్టుకు 20 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, అవుట్‌ఫ్లో 3 వేల క్యూసెక్కులే ఉంది. తుంగభద్రకు ఇన్‌ఫ్లో తగ్గిపోవడంతో 30,728 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతోంది. ఇదిలా ఉండగా, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో గోదావరిపై నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. ఆదివారం సాయంత్రం ఇన్‌ఫ్లో 2.89 లక్షల క్యూసెక్కులుగా నమోదైంది. నీటిమట్టం 4.20 మీటర్లు ఉంది. దీంతో కుంగిన ఏడో బ్లాక్‌లోని గేట్లతో పాటు మొత్తం 85 గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు.

## తీర్మానం మల్లన్నపై దాడి ఖండిస్తున్నాం: టీజేఎస్ఎస్

- తెలంగాణ జాగృతి అధ్యక్షులుగా బీసీ అభ్యర్థి పేరు ప్రకటించగలరా.?
- రాజకీయ లబ్ధి కోసమే బీసీ వాదం ఎత్తుకున్న కవిత
- బీఆర్ఎస్ పార్టీ ఇంటి పోరు పడలేకనే తెలంగాణ జాగృతి ఓవరాక్షన్
- అధికారంలో ఉన్నప్పుడు బీసీలు కనపడలేదా.? ఇప్పుడు ఉత్తిత్తి ప్రేమ ఎందుకు.?
- తీన్మార్ మల్లన్న సామెతలలో తప్పేముంది, సామెతలను కూడా తప్పుపట్టే సంస్కారం మీది
- అధికారంలో ఉన్న లేకున్నా బీఆర్ఎస్ చేస్తున్న దాడులు బీహార్ మూలాలకు కారణమా.?

**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:** ప్రశ్నించే గొంతుకలను అణిచివేయాలని గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ పార్టీ ఎంతోమంది జర్నలిస్టులపై తప్పుడు కేసులు పెట్టిందని, పది సంవత్సరాలు అధికా రంలో ఉన్నప్పుడు జర్నలిస్టులు, బీసీ కుల సంఘాలు, బీసీ వాదం ఎక్కడా మాట్లాడని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఇప్పుడు బీసీ వాదంతో బీసీలకు న్యాయం చేస్తానని 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలుకై పోరాడుతున్నానని కల్లబొల్లి మాటలు చెబుతూ తన రాజకీయ భవిష్యత్తును కాపాడుకుంటూ బీసీ వాదాన్ని ముందుకేసుకుని తన రాజకీయ లబ్ధి కోసం పరుగులు పెడుతుందని తెలంగాణ జర్నలిస్ట్ సంక్షేమ సంఘం నాయకులు పేర్కొన్నారు. తీన్మార్ మల్లన్న అనుచిత వ్యాఖ్యలు చేశారని తన గుండాలతో తీన్మార్ మల్లన్న క్యూ న్యూస్ ఆఫీస్ పై దాడి చేయడం అమానుషమని, మల్లన్న తప్పుగా మాట్లాడితే చట్టపరమైన చర్య తీసుకోవాలని ముఖ్యమంత్రికి శాసనమండలిలో, పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలి తప్ప తన అనుచరుల పేరుతో గుండాలను ఏర్పాటుచేసివి మల్లన్న పై దాడి చేపించడం అమానుషమని ఈ దాడిని టిజేఎస్ఎస్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు.

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలుగా బీసీ బిడ్డను కల్వకుంట్ల కవిత ప్రకటిస్తుందా.? అని ఈ సందర్భంగా అన్నారు. బీసీ వాదాన్ని ముందుకు తీసుకెళుతున్న తీన్మార్ మల్లన్న కు బీసీల నుండి భారీగా మద్దతు వస్తుందని ఓర్వలేక కవిత చిల్లర రాజకీయాలు చేయడం జరుగుతుందన్నారు. బీసీలకు తెలంగాణ జాగృతిలో అధ్యక్ష స్థానాన్ని కల్పిస్తుందా.? తన రాజకీయ లబ్ధి కోసం బీఆర్ఎస్ పార్టీలో ఇంటి పోరు పడలేక బిఆర్ఎస్ నుండి అనధికారికంగా వెల్లగొట్టారని దానితో తెలంగాణ జాగృతి పేరుతో ప్రజలతో మమేకమై తన రాజకీయ భవిష్యత్తును కాపాడుకోవాలని చూస్తున్న కల్వకుంట్ల కవిత పది సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు బీసీలకు తమ ప్రభుత్వం ఏమి న్యాయం చేసిందని ఈ సందర్భంగా టీజేఎస్ఎస్ ప్రశ్నిస్తోంది. ప్రశ్నించే గొంతుకలను అనచివేయడం ఎవరి తరం కాదని, తప్పు చేసిన వారిని ప్రజలు తప్పకుండా శిక్షిస్తారని, దౌర్జన్యాలతో భయభ్రాంతులను చేసి అంచివేయాలని చూస్తే ఎవరు చూస్తూ ఊరుకోరని తప్పు ఎవరు చేసినా పార్టీలకు అతీతంగా టీజేఎస్ఎస్ ఖండిస్తదని ఈ సందర్భంగా అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు తెలంగాణ ఉద్యమ సమయంలో ఎస్సీ అభ్యర్థిని ముఖ్యమంత్రి చేస్తానని ప్రకటించి అధికారం చేపట్టాక బడుగు బలహీన వర్గాలను దూరం పెట్టలేదా అని ఈ సందర్భంగా అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తీన్మార్ మల్లన్న కార్యాలయం పై దాడులు చేయడం అధికారం పోయిన తర్వాత కూడా దాడులు చేయడం చూస్తుంటే బీఆర్ఎస్ నేతలకు బీహార్ మూలాలు ఇంకా రక్తంలో ఉన్నాయా అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు కనిపియ్యని మీ పార్టీ అధ్యక్షునికి ఎమ్మెల్సీ కవితకు ఇప్పుడు బీసీ బిడ్డలు కనిపించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దమ్ముంటే ముందుగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా బడుగు బలహీన వర్గాలను ప్రకటించమని ఈ సందర్భంగా టీజేఎస్ఎస్ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇకపై ప్రశ్నించే గొంతుకలు జర్నలిస్టులపై ఎవరు దాడి చేసిన తప్పుడు కేసులు పెట్టిన బడుగు బలహీన వర్గాల బిడ్డలు చూస్తూ ఊరుకోరని ఈ సందర్భంగా టీజేఎస్ఎస్ నేతలు తెలిపారు.

## పేరెంట్స్ మీటింగ్ రోజే అన్నంలో పురుగులు

- తమ పిల్లలకు రోజూ ఇలాంటి భోజనమే పెడుతున్నారా.. అంటూ సిబ్బందిపై విద్యార్థుల తల్లిదండ్రుల ఆగ్రహం
- వికారాబాద్ జిల్లా సిరిపురం ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఘటన

**వికారాబాద్, జూలై 13:** పేరెంట్స్ మీటింగ్ సందర్భంగా తమ పిల్లల బాగోగులు తెలుసుకునేందుకు వసతి గృహానికి వచ్చిన తల్లిదండ్రులు భోజనంలో పురుగులు చూసి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పిల్లలకు రోజూ ఇలాంటి భోజనమే పెడుతున్నారా అంటూ ప్రశ్నించారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం సిరిపురంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో జరిగింది. ఆదివారం వసతి గృహ వార్డెన్ విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. వసతి గృహంలో అన్ని వసతులు ఉన్నాయని, పిల్లలు బాగా చదువుతున్నారని–చెప్పి సమావేశాన్ని ముగించారు. మధ్యాహ్న సమయంలో విద్యార్థులకు సిబ్బంది భోజనం వడ్డిస్తుండగా కొంత మంది విద్యార్థుల తల్లిదండ్రులు పాత్రలో ఉన్న అన్నాన్ని పరిశీలించారు. పురుగులు కనిపించడంతో వారు ఆగ్రహానికి గురయ్యారు. విద్యార్థులకు ఈ విధమైన భోజనాన్ని వడ్డిస్తారా అంటూ వార్డెన్, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వసతి గృహంలో తాము ఉండగానే ఇలాంటి భోజనం వడ్డిస్తున్నారంటే తమ పిల్లలకు ప్రతిరోజూ ఏ విధమైన భోజనం అందిస్తున్నారో అర్థమవుతోందని మండిపడ్డారు. జిల్లా స్థాయి అధికారుల పర్యవేక్షణా లోపంతోనే ఇలాంటివి జరుగుతున్నాయని ఆరోపించారు.

## అన్ని కోచ్‌లకు సీసీకెమెరాలు..

### రైల్వేశాఖ కీలక నిర్ణయం

**ఢిల్లీ:** ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేస్తూ భారతీయ రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. అన్ని రైలు బోగీల ద్వారాల వద్ద సీసీటీవీ కెమెరాలు అమర్చాలని నిర్ణయించింది. ఈ మేరకు రైల్వేశాఖ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. రైల్వేశాఖ తీసుకున్న ఈ నిర్ణయం ప్రయాణికుల భద్రతను గణనీయంగా మెరుగుపరుస్తుందని, ప్రయాణికుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని అరాచకాలకు పాల్పడుతున్న దుండగుల, వ్యవస్థీకృత ముఠాలను నిరోధించగలవని తెలిపారు. రైల్వే కోచ్‌లకు సీసీటీవీ కెమెరాల ఏర్పాటును ప్రయోగాత్మకంగా ఇటీవల నార్తరన్ రైల్వే పరిధిలో చేపట్టారు. అక్కడ విజయవంతమవడంతో దేశవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, సహాయ మంత్రి రవనీత్ సింగ్ బిట్టూ, పలువురు ఉన్నతాధికారులు శనివారం సమీక్ష నిర్వహించినట్లు ఓ అధికారి వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఉన్న 74 వేల కోచ్‌లు, 15 వేల లోకో కోచ్‌లకు సీసీకెమెరాల ఏర్పాటుకు అశ్వినీ వైష్ణవ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. “ప్రతి రైల్వేకోచ్ ద్వారాల వద్ద డోమ్ ఆకృతిలో సీసీ కెమెరాలు ఉంటాయి. లోకో కోచ్‌లకు ద్వారాలతోపాటు ముందు, వెనుకతో కలిపి ఆరు సీసీ కెమెరాలు అమరుస్తారు.” అని రైల్వేశాఖ అధికారి వెల్లడించారు. 100 కిలోమీటర్ల వేగంతో వెళ్లినా అత్యంత నాణ్యతతో ఫుటేజీ వచ్చేలా జాగ్రత్తలు పాటించాలని అశ్వినీ వైష్ణవ్ అధికారులకు సూచించినట్లు తెలుస్తోంది. చీకటిలోనూ వీడియో క్వాలిటీ బాగుండేలా అధునాతన సీసీకెమెరాలను అమర్చాలని ఆయన దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. అందుకు అవసరమైతే కృత్రిమమేధని కూడా వినియోగించాలని కోరినట్లు తెలుస్తోంది.



## కొల్లగొట్టిన ఆయుధాలను.. స్నైపర్ రైఫిళ్లుగా మార్చుతూ..

**మణిపూర్ :** మణిపూర్‌లో జాతుల మధ్య ఘర్షణలు తీవ్రస్థాయిలో కొనసాగుతున్న సమయంలో పోలీసు ఆయుధాగారాల నుంచి వేలాది ఆయుధాలను ఆందోళనకారులు లూటీ చేసిన విషయం తెలిసిందే. ఆ ఆయుధాల్లో మార్పులు, చేర్పులు చేపడుతూ.. వాటిని మరింత ప్రమాదకరంగా మార్చినట్లు అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. కాల్పుల తీవ్రతను, పరిధిని మరింత పెంచేలా ఆ ఆయుధాలను మలచినట్లు వెల్లడించారు. "పోలీసు ఆయుధాగారాల నుంచి దాదాపు ఆరు వేల ఆయుధాలు అపహరణకు గురయ్యాయి. వాటిలో ఏకే అసాల్ట్, పాయింట్ 303, ఇన్సాస్ రైఫిళ్లు, కార్బైన్ వంటివి ఉన్నాయి. ప్రత్యర్థులను సుదూరం నుంచే లక్ష్యంగా చేసుకునేందుకు వీలుగా వాటిని స్నైపర్ రైఫిళ్లుగా మార్చారు. సాధారణంగా పాయింట్ 303 రైఫిల్ పరిధి దాదాపు 500 మీటర్లు ఉంటుంది. కానీ, మార్పులు చేపట్టి, ప్రత్యేక టెలిస్కోప్‌ను అమర్చిన అనంతరం.. దాని పరిధి, కచ్చితత్వం, ప్రాణాంతక సామర్థ్యం మరింత పెరుగుతుంది" అని అధికారులు తెలిపారు. మణిపూర్‌లో ఈ ఏడాది ఫిబ్రవరిలో రాష్ట్రపతి పాలన అమల్లోకి వచ్చిన అనంతరం.. అక్రమ ఆయుధాలు, పేలుడు పదార్థాలను అప్పగించాలంటూ గవర్నర్ అజయ్ కుమార్ భల్లా ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలోనే భద్రతా బలగాలు ఇప్పటివరకు వేలాది అక్రమ తుపాకులు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నాయి. గత నెలలో ఇంఫాల్ లోయలోని ఐదు జిల్లాల్లో 328, జులై మొదటి వారంలో కొండ ప్రాంతాల్లోని నాలుగు జిల్లాల్లో 203 ఆయుధాలను సీజ్ చేశాయి. రాష్ట్రపతి పాలన విధించినప్పటి నుంచి.. కొత్తగా ఆయుధాలను ఎత్తుకెళ్లిన ఘటనలేవీ నమోదు కాలేదని అధికారులు వెల్లడించారు.

## వచ్చే ఐదేళ్లలో కోటి ఉద్యోగాలు
### : సీఎం నీతీశ్ కుమార్



**పట్నా:** బిహార్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో మరోసారి అధికారంలోకి వచ్చేందుకు ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ ప్రయత్నాలు మొదలు పెట్టారు. నిరుద్యోగులను ఆకట్టుకునేందుకు ఎక్స్ వేదికగా కీలక ప్రకటన చేశారు. 2025-2030 మధ్య కాలంలో కోటి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. గతంలో ఇచ్చిన 50 లక్షల ఉద్యోగాల కల్పన హామీ దాదాపు పూర్తయిందన్నారు. గడిచిన ఐదేళ్లలో 10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయగా.. దాదాపు 39 లక్షల మందికి ఉపాధి కల్పించినట్లు నీతీశ్ చెప్పారు. గతంతో పోల్చుకుంటే ఈసారి రెట్టింపు ఉద్యోగాలు కల్పించబోతున్నామన్నారు. కేవలం ప్రభుత్వ సెక్టార్‌లోనే కాకుండా ప్రైవేటు, ఇతర పారిశ్రామిక రంగాల్లో ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. దీనికోసం ఉన్నత స్థాయి కమిటీని కూడా ఏర్పాటు చేయబోతున్నట్లు నీతీశ్ పేర్కొన్నారు. " ప్రస్తుత ప్రభుత్వ హయాంలో 10 లక్షల మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలిచ్చాం. ప్రైవేటు రంగంలో మరో 39 లక్షల మందికి ఉపాధి కల్పించాం. గతంలో ఇచ్చిన 50 లక్షల ఉద్యోగాల హామీ దాదాపు నెరవేరినట్లే. ఇప్పుడు లక్ష్యాన్ని రెట్టింపు చేస్తున్నాం. వచ్చే ఐదేళ్లలో కోటి ఉద్యోగాలిస్తాం. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో కొత్త ఉద్యోగాలను సృష్టిస్తాం. ప్రధానంగా పారిశ్రామిక రంగాల్లో యువతకు ఉపాధి చూపిస్తాం" అని నీతీశ్ కుమార్ పేర్కొన్నారు. బిహార్‌లో ఈ ఏడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో ఎన్నికలు జరిగే అవకాశముంది.



## అమెరికా నుంచి 'గోల్డెన్ చాసిస్'.. విమాన ప్రమాద దర్యాప్తులో కీలకపాత్ర..

**అహ్మదాబాద్ :** అహ్మదాబాద్‌లో జూన్ 12న జరిగిన ఎయిర్ ఇండియా ఏఐ 171 విమాన ప్రమాద దర్యాప్తులో ఓ పరికరం కీలక పాత్ర పోషించింది. దీనిని అమెరికా నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చారు. దాని పేరు గోల్డెన్ చాసిస్..! డేటా సేకరణలో ఇది అత్యంత కీలక పాత్ర పోషిస్తోంది. ప్రమాదానికి గురైన బోయింగ్ 787-8 డ్రీమ్ లైనర్‌కు సంబంధించిన బ్లాక్‌బాక్స్‌ను అధికారులు వేగంగానే కనుగొన్నా.. దాని నుంచి డేటాను డౌన్‌లోడ్ చేయడం కత్తిమీద సాము. ప్రమాద సమయంలో వెలువడిన తీవ్రమైన వేడి కారణంగా అది దెబ్బతిని ఉంది. ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరోలోని సంప్రదాయ ల్యాబ్‌లో దీని నుంచి డేటా డౌన్‌లోడ్ సాధ్యం కాలేదు. దీంతో యునైటెడ్ స్టేట్స్ నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డు వినియోగించే గోల్డెన్ చాసిస్ అనే ప్రత్యేక పరికరాన్ని రప్పించారు. ఇది దెబ్బతిన్న ఫ్లైట్ రికార్డర్స్ నుంచి కూడా డేటాను సేకరించగలదు. అవి తీవ్రంగా దెబ్బతిన్న సమయంలో వాటి క్రాష్ ప్రొటెక్షన్ మాడ్యూల్‌ను తొలగించి.. గోల్డెన్ చాసిస్‌పై దానిని అమరుస్తారు. దీంతో ఫ్లైట్, కాక్‌పిట్ వాయిస్ డేటాను డౌన్‌లోడ్ చేసుకోవడం సాధ్యమవుతుంది. తాజాగా దర్యాప్తులో కూడా గోల్డెన్ చాసిస్, కేబుల్స్‌ను అమెరికాలోని ఎన్‌టీఎస్‌బీ నుంచి ప్రత్యేకంగా తెప్పించి వాడారు. దీంతో ఏఐ 171కు సంబంధించి గత ఆరు ప్రయాణాల డేటా డౌన్‌లోడ్ అయింది. వీటిల్లో ప్రమాదం జరిగినప్పటిది కూడా ఉంది. ఇది మొత్తం 49 గంటల ఫ్లైట్ డేటాను డౌన్‌లోడ్ చేయడానికి సాయం చేసింది. అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్తున్న ఎయిరిండియా బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ జూన్ 12వ తేదీన టేకాఫ్ అయిన వెంటనే కూలిపోయిన సంగతి తెలిసిందే. అందులోని ఒక్కరు మినహా ప్రయాణికులు, సిబ్బంది కలిపి 241 మంది మరణించారు. వారితోపాటు విమానం ఆసుపత్రి హాస్టల్‌పై కూలిపోవడంతో 29 మంది మృతి చెందారు. రెండు ఇంజిన్లకు రెప్పపాటు (సెకను) వ్యవధిలో ఇంధన సరఫరా నిలిచిపోవడంవల్లే అహ్మదాబాద్‌లో ఎయిరిండియాకు చెందిన ఏఐ171 విమానం కూలిపోయిందని ప్రాథమిక దర్యాప్తు నివేదిక తేల్చింది. ఇంధన సరఫరాను ఎందుకు ఆపావని ఒక పైలట్ ప్రశ్నించగా.. తాను ఆపలేదని మరో పైలట్ సమాధానమివ్వడం కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌లో నమోదైందని తెలిపింది.

# ఏమిటీ ఈ-వీసా..
## జులై 15 నుంచి యూకేలో అమలు..

**యూకే :** యునైటెడ్ కింగ్‌డమ్‌లో జులై 15 నుంచి సాధారణ వీసాల స్థానంలో ఈ-వీసాలు అమల్లోకి రానున్నాయి. ఇమిగ్రేషన్ వ్యవస్థలో చేపట్టిన విస్తృత మార్పుల్లో భాగంగా వీటిని వాడుకలోకి తీసుకొస్తున్నారు. జులై 15 నుంచి జారీ చేసే అన్ని వీసాలు వాటిని పొందేవారి పాస్‌పోర్టులతో లింకై.. డిజిటల్ రూపంలో ఉండనున్నాయి. ఇవి అన్ని రకాల వాటికి వర్తిస్తుంది. యూకేలో విద్యాభ్యాసం చేసే వారిలో భారతీయుల సంఖ్యే ఎక్కువ. ఇమిగ్రేషన్ ప్రాసెస్‌ను గాడినపెట్టేందుకు ఈ సరికొత్త వీసాలను అమల్లోకి తెస్తోంది. విద్యార్థులు కచ్చితంగా తమ డిజిటల్, ప్రొసీజరల్ అంశాలను ప్రయాణానికి ముందే సరిచూసుకోవాల్సి ఉంటుంది. సరికొత్త విధానం ప్రకారం పాస్‌పోర్టుపై సంప్రదాయ వీసా విగ్నెట్‌ను జారీ చేయరు. దీనికి బదులు ఈ-వీసా జారీ చేస్తారు. ఇది డిజిటల్ ఇమిగ్రేషన్ హోదాను అందిస్తుంది. ఈవీసాల్లో కచ్చితంగా విద్యార్థులు అప్‌డేట్ చేసిన పర్సనల్ పాస్‌పోర్టు వివరాలు ఉండాల్సిందే. పాస్‌పోర్టు రెన్యూవల్‌లో మార్పులను కూడా తెలియజేయాల్సి ఉంటుంది. విద్యార్థులు కచ్చితంగా యూకేవీఐ ఖాతాను క్రియేట్ చేసుకొని వారి ఈవీసాను మేనేజ్ చేసుకోవాలి. వీసా వివరాలు, అప్‌డేట్ ఇన్ఫర్మేషన్, ఇమిగ్రేషన్ స్టేటస్ సమాచారం ఆయా విద్యాసంస్థలకు, యజమానులకు, కంపెనీలకు తెలియజేయడానికి ఉపయోగపడుతుంది. దీంతోపాటు విద్యార్థులు లాగిన్ క్రెడెన్షియల్స్, కాంటాక్ట్ డిటైల్స్‌ను సరిగ్గా గుర్తుంచుకోవాలి. విద్యార్థులు యూకేలో బస చేసేందుకు, కోర్సుల్లో రిజిస్టర్ చేసుకునే సమయాల్లో.. ఆయా కంపెనీలు, ల్యాండ్ లార్డ్స్, విశ్వవిద్యాలయాలు యూకేవీఐ ఖాతాను తనిఖీ చేయాల్సి ఉంటుంది. ఈవీసా జారీ అయినా.. విద్యార్థులు మాత్రం తమ పాస్‌పోర్టును, ప్రింటెడ్ లేదా డిజిటల్ వీసా కాపీలను తమతో ఉంచుకోవాలి. బోర్డర్ ఆఫీసర్లు పాస్‌పోర్టును స్కాన్ చేసి ఈవీసాను తనిఖీ చేస్తారు. ఇక వీసా జారీ అయ్యాక.. పాస్‌పోర్టును రెన్యూవల్ చేస్తే.. ఆ వివరాలను



విద్యార్థులు తమ ఇంగ్లాండ్ ప్రయాణానికి ముందే తమ యుకేవీఐ ఖాతాలో అప్‌డేట్ చేయాలి.

### యూకే ప్రయాణానికి ముందు..

- ఈవీసా జారీని ధ్రువీకరించుకోవాలి. పాస్‌పోర్ట్ లింకేజీని సరిచూసుకోవాలి.
- యూకేవీఐ ఖాతా కోసం రిజిస్టర్ చేసుకోవాలి. క్రెడెన్షియల్స్‌ను జాగ్రత్తగా ఉంచుకోవాలి.
- డిజిటల్ సిస్టమ్‌లో అన్ని పర్సనల్, పాస్‌పోర్టు వివరాలను నమోదు చేయాలి.
- వీసా డెసిషన్ లెటర్‌ను ప్రింట్ తీసుకోవడమో.. సేవ్ చేసుకోవడమో చేయాలి.
- వీసా అప్లికేషన్‌లో వాడిన పాస్‌పోర్టును వారి వద్ద ఉంచుకోవాలి.
- ఇమిగ్రేషన్ వెరిఫికేషన్ కోసం యూనివర్శిటీ అకామిడేషన్‌కు సంబంధించిన పాలసీలను సరిచూసుకోవాలి.

## భారత్‌తో బంధంలో ఓ సమస్య..
# దలైలామా వారసుడి ఎంపిక : చైనా

**దిల్లీ:** టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా వారసుడి ఎంపిక విషయం చైనా భారత్ సంబంధాలలో ఓ సమస్యగా మారిందని భారత్‌లోని చైనా రాయబార కార్యాలయం పేర్కొంది. భారత్‌లోని కొందరు వ్యక్తులు దలైలామా వారసత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని చైనా రాయబార కార్యాలయ ప్రతినిధి యు జింగ్ ఆదివారం సోషల్ మీడియా వేదికగా ఆరోపించారు. భారత విదేశాంగ నిపుణులు టిబెట్‌కు సంబంధించిన సమస్యల సున్నితత్వాన్ని పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. దలైలామా పునర్జన్మ, వారసత్వం పూర్తిగా చైనా అంతర్గత వ్యవహారమని.. ఇందులో భారత్ కల్పించుకోవడం వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. 2020లో గల్వాన్ ఘటనతో ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తిన తర్వాత భారత విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ చైనాలో తొలిసారి పర్యటించనున్నట్లు ఇటీవల ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. చైనా విదేశాంగశాఖ మంత్రి వాంగ్ యితో జైశంకర్ బీజింగ్‌లో ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశముందని తెలిపాయి. ఈ నేపథ్యంలో చైనా రాయబార కార్యాలయం నుంచి ఈ వ్యాఖ్యలు వెలువడడం గమనార్హం. దాదాపు ఆరు దశాబ్దాలుగా టిబెట్ నియంత్రణపై చైనాతో టిబెట్ బౌద్ధగురువు దలైలామాకు వివాదం ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన ఇటీవల మాట్లాడుతూ..చైనా బయటే




తన వారసుడు జన్మిస్తాడని పేర్కొన్నారు. అది భారత్‌లో కూడా కావచ్చని వ్యాఖ్యానించారు. తన వారసత్వంపై నిర్ణయం తీసుకునే హక్కు చైనాకు లేదని స్పష్టం చేశారు. అనంతరం దలైలామా వారసుడి ఎంపికకు కచ్చితంగా తమ ఆమోదముద్ర కావాలంటూ చైనా డిమాండ్ చేసింది. ఇదిలా ఉండగా.. ఇటీవల దలైలామా పుట్టిన రోజు వేడుకలకు హాజరైన భారత కేంద్రమంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. 15వ దలైలామాను ఎన్నుకునే అధికారం పూర్తిగా ప్రస్తుత దలైలామా చేతుల్లోనే ఉంటుందని, ఆ అధికారం ఇంకెవరికీ లేదని స్పష్టం చేశారు.

## కరాచీ వెళదామని విమానం ఎక్కితే.. సౌదీలో దింపారు

**సౌదీ :** సాధారణంగా రైళ్ల నెంబర్ల విషయంలో గందరగోళానికి గురై.. ఒక చోట దిగాల్సిన వారు మరో చోటికి చేరుకొన్న ఘటనలను మనం చూశాం. కానీ, పాకిస్థాన్ ఎయిర్‌లైన్ మరో అడుగు ముందుకేసి.. మరో ఊరు వెళ్లాల్సిన ప్రయాణికుడిని.. ఏకంగా ఇంకో దేశంలోకి తీసుకెళ్లి వదిలేసింది. తాజాగా పాకిస్థాన్‌లో షాజహాన్ అనే వ్యక్తి లాహోర్ నుంచి కరాచీకి బయల్దేరాడు. అతడు స్థానిక ఎయిర్ పోర్టుకు చేరుకొన్నాడు. అతడు దేశీయ విమానాలు ఆగే డొమెస్టిక్ టెర్మినల్ నుంచి లోపలికి ప్రవేశించాడు. వాటిల్లో అతడు కరాచీ వెళుతుందని భావించిన ఓ విమానంలోకి ఎక్కాడు. అతడు లోపలికి వెళుతున్నప్పుడు సిబ్బందికి టికెట్ చూపించగా.. అనుమతించారు. తీరా విమానం ప్రయాణం ప్రారంభించి చాలా సేపు అయినా.. కరాచీలో ల్యాండ్ కాకపోవడంతో అనుమానం వచ్చింది. సిబ్బందిని పిలిచి.. రెండుగంటలు దాటినా విమానం కరాచీకి ఎందుకు చేరలేదని ప్రశ్నించాడు. దీంతో కంగుతినడం సిబ్బంది వంతైంది. ఆ తర్వాత వారు తేరుకొని ప్రయాణికుడిదే తప్పు అని నిందించడం మొదలుపెట్టారు. కనీసం తనను తిరిగి కరాచీకి చేర్చాలని కోరగా.. ఆ ప్రక్రియ పూర్తికావడానికి మూడ్రోజుల సమయం పడుతుందని చెప్పడం గమనార్హం. ఈ గందరగోళానికి కారణమైన ప్రైవేటు ఎయిర్‌లైన్స్ మాత్రం సదరు ప్రయాణికుడు కరాచీకి మరో టికెట్ కొనుగోలు చేస్తే గానీ తీసుకెళ్లలేమని చెప్పింది. సదరు ప్రయాణికుడి వద్ద పాస్‌పోర్టు కూడా లేకపోవడంతో జెడ్డాలో దిగగానే.. అక్కడి ఇమిగ్రేషన్ అధికారులు అతడిని కొద్దిసేపు అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. పరిస్థితి అర్థం చేసుకొన్న వారు అతడిని లాహోర్‌కు తిరిగి పంపించారు. మరోవైపు ఈ విషయంపై పాక్ ఎయిర్ పోర్టు అథారిటీ నుంచి పౌర విమానయాన శాఖకు లేఖ వెళ్లింది. దీంతో సదరు ప్రైవేటు ఎయిర్ లైన్స్‌సంస్థకు భారీగా ఫైన్ విధించారు. వాస్తవానికి లాహోర్ విమానాశ్రయంలో ఇంటర్నేషనల్ టెర్మినల్‌కు మరమ్మతులు నిర్వహిస్తున్నారు. దీంతో అక్కడి విమానాలను డొమెస్టిక్ టెర్మినల్ వద్దే ఉంచుతుండటంతో ఏర్పడిన గందరగోళం కారణంగానే ఈ ఘటన చోటు చేసుకున్నట్లు గుర్తించారు.

# నస్రల్లాను హతమార్చినట్లే..
## ఇరాన్ అధ్యక్షుడి హత్యకు ఇజ్రాయెల్ యత్నం.. ఇరాన్ ఆరోపణలు..

**ఇరాన్ :** ఇటీవల ఇరాన్‌లోని అణ్వాయుధ స్థావరాలు, ముఖ్య నేతల నివాసాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. అయితే బీరుట్‌లో హెజ్‌బొల్లా నాయకుడు నస్రల్లాను హత్య చేసిన విధంగానే ఇరాన్‌పై దాడుల సమయంలో ఇజ్రాయెల్.. తమ దేశాధ్యక్షుడిని హతమార్చడానికి ప్రయత్నించిందని ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్(ఐఆర్‌జీసీ)కు సంబంధించిన వార్తా సంస్థ పేర్కొంది. జూన్ 16న టెహ్రాన్‌లోని ఓ భవనంలో నిర్వహించిన ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సమావేశానికి ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాగర్ గాలిబాఫ్, న్యాయవ్యవస్థ చీఫ్ మొహ్సేని ఏజీ, ఇతర సీనియర్ అధికారులు హాజరయ్యారని వార్తాసంస్థ తెలిపింది. ఉన్నతాధికారులు సమావేశంలో ఉన్న సమయంలో ఆ భవనంపై ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడిందని వార్తాసంస్థ వెల్లడించింది. అందులోని వారు తప్పించుకునే వీలు లేకుండా భవనానికి ఉన్న ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్‌లను లక్ష్యంగా చేసుకొని.. ఆరు క్షిపణులను ప్రయోగించిందని ఆరోపించింది. దాడులతో విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పటికీ అధికారులు ముందుగానే సిద్ధం చేసుకున్న అత్యవసర



హాచ్ ద్వారా తప్పించుకోగలిగారని తెలిపింది. అక్కడి నుంచి తప్పించుకుంటున్న సమయంలో ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ సహా పలువురు ఉన్నతాధికారులకు గాయాలు అయినట్లు తెలిపింది. హెజ్‌బొల్లా నాయకుడు నస్రల్లాను హత్య చేయడానికి ఇజ్రాయెల్ ఇదే తరహాలో దాడి చేసిందని.. ఇరాన్ అధ్యక్షుడి విషయంలో మాత్రం విఫలమయ్యిందని పేర్కొంది.

## కేరళ సీఎం విజయన్ నివాసానికి బాంబు బెదిరింపు



**తిరువనంతపురం:** కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అధికారిక నివాసానికి బాంబు బెదిరింపు వచ్చింది. తంపనూరు పోలీస్ స్టేషన్‌కు గుర్తు తెలియని వ్యక్తులు ఇ-మెయిల్ పంపారు. క్లిఫ్ హౌస్ వద్ద బాంబు పేలుళ్లు జరగబోతున్నాయంటూ ఇ-మెయిల్‌లో పేర్కొన్నారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఆయన నివాసంలో విస్తృతంగా తనిఖీలు చేసి.. అది నకిలీ ఇ-మెయిల్‌గా తేల్చారు. "బాంబు బెదిరింపు తర్వాత ముఖ్యమంత్రి నివాసాన్ని డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్‌లతో క్షుణ్నంగా తనిఖీలు నిర్వహించాం. కానీ ఎక్కడా అనుమానాస్పదంగా కనబడలేదు" అని పోలీసులు వెల్లడించారు. తనిఖీల సమయంలో సీఎం విజయన్, ఆయన కుటుంబం విదేశాల్లో ఉన్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కీలక సంస్థలను లక్ష్యంగా చేసుకుని ఇటీవల వచ్చిన బాంబు బెదిరింపుల వ్యవహారంతో తాజాగా వచ్చిన ఇ-మెయిల్‌కు సంబంధం ఉందా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.




## ఇక దేశవ్యాప్తంగా ఓటరు జాబితాల సమగ్ర సవరణ?

**బిహార్ :** బిహార్‌లో ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను చేపట్టే రాజ్యాంగబద్ధమైన అధికారం ఎన్నికల సంఘానికి ఉందని సుప్రీం కోర్టు ఇటీవల స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే దేశవ్యాప్తంగానూ ఈ కసరత్తు చేపట్టేందుకు ఎన్నికల సంఘం సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. బిహార్‌లో మాదిరే.. వచ్చే నెలలో దేశవ్యాప్తంగా ఈ ప్రక్రియ నిర్వహించేందుకు స్థానిక ఎన్నికల యంత్రాంగాన్ని ఈసీ సమాయాత్తం చేస్తున్నట్లు సమాచారం. దేశంలోని చాలావరకు రాష్ట్రాలు 2002-04 మధ్యకాలంలో ఓటరు జాబితాల సమగ్ర సవరణ చేపట్టాయి. ఈ క్రమంలోనే తాజాగా కొన్ని రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారులు (సీఈవో) తమ రాష్ట్రాల్లో చివరిసారి సమగ్ర సవరణ చేపట్టిన అనంతరం ప్రచురించిన ఓటర్ల జాబితాను అందుబాటులోకి ఉంచుతున్నారు. దేశ రాజధాని దిల్లీలో చివరిసారి 2008లో ఈ ప్రక్రియ నిర్వహించగా.. ఆ ఓటర్ల జాబితాను సీఈవో వెబ్‌సైట్‌లో ఉంచారు. ఉత్తరాఖండ్‌లో 2006లో చేపట్టగా.. ఆ ఏడాది లిస్ట్ కూడా రాష్ట్ర సీఈవో వెబ్‌సైట్‌లో కనిపిస్తోంది. బిహార్ ఓటరు జాబితాల సవరణ వ్యవహారం ఈ నెల 28న సుప్రీం కోర్టులో మరోసారి విచారణకు రానుంది. ఆ తర్వాత దేశవ్యాప్తంగా ఈ కసరత్తు నిర్వహణపై ఎన్నికల సంఘం తుది నిర్ణయం తీసుకుంటుందని ఓ అధికారి వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాలను సమగ్రంగా సమీక్షించి.. విదేశీ అక్రమ వలసదారులను తొలగించనున్నట్లు ఈసీ గతంలోనే ప్రకటించింది. బంగ్లాదేశ్, మయన్మార్ సహా విదేశీ అక్రమ వలసదారులపై వివిధ రాష్ట్రాల్లో కఠిన చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో ఈ ప్రక్రియ ప్రాధాన్యం సంతరించుకుంది. బిహార్‌లో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణను సవాల్ చేస్తూ దాఖలైన 10కిపైగా పిటిషన్లను ఈ నెల 10న సుప్రీం కోర్టు విచారించింది. ఈ ప్రక్రియను చేపట్టే రాజ్యాంగబద్ధమైన అధికారం ఈసీకి ఉందని స్పష్టం చేసింది. అయితే, ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు త్వరలో జరగనున్న తరుణంలో దీన్ని చేపట్టడం సమర్థనీయంగా లేదని అభిప్రాయపడింది. అదే సమయంలో.. దీనిపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. ఆ ప్రక్రియను కొనసాగించవచ్చని చెబుతూనే.. ఓటర్ల గుర్తింపునకు పరిశీలించే పత్రాల జాబితాలో ఆధార్, రేషన్, ఓటరు ఐడీ కార్డునూ చేర్చాలని ఈసీకి సూచించింది.



## నీటి కోసం ఎదురుచూస్తున్న వారిపై కాల్పులు
### గాజాలో 19 మంది మృతి

**డెయిర్ అల్ బలా:** గాజాలోని సామాన్య పౌరులపై ఇజ్రాయెల్ దాడులు పాశవికంగా కొనసాగుతున్నాయి. తాగునీటి కోసం ఓ ప్రాంతంలో గుమిగూడిన జనంపై ఆదివారం జరిపిన దాడిలో 19 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఆరుగురు చిన్నారులు కూడా ఉన్నారు. ఈ మేరకు అక్కడి ఆరోగ్యశాఖ వర్గాలు వెల్లడించాయి. తాజా మరణాలతో ఇప్పటి వరకు మృతి చెందిన వారి సంఖ్య 58 వేలు దాటిందని తెలిపాయి. ఇజ్రాయెల్ కాల్పుల విరమణ చేపట్టాలని ప్రతిగా తమ వద్ద బందీలుగా ఉన్న ఆ దేశ పౌరుల్ని విడుదల చేయాలన్న నిబంధనతో ఇరు వర్గాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. అయితే, ఆ దిశగా పరోగతి సాధించేందుకు మాత్రం వారు ముందుకు రావడం లేదు. గత వారం ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అమెరికా పర్యటనకు వెళ్లారు. అక్కడ ట్రంప్ యంత్రాంగంతో చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో కొత్త వివాదం తెరమీదకి వచ్చింది. గాజా స్ట్రిప్ నుంచి తమ బలగాలను వెనక్కి తీసుకునేందుకు ఇజ్రాయెల్ నిరాకరించింది. దక్షిణ గాజాలో తమ సైన్యాన్ని కొనసాగించాలని భావిస్తోంది. దీనిపై హమాస్ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. తాత్కాలిక కాల్పుల విరమణ ముగిసిన తర్వాత ఇజ్రాయెల్ మళ్లీ యుద్ధాన్ని కొనసాగించాలని చూస్తోందని, అందుకే బలగాల ఉపసంహరణకు అంగీకరించడం లేదని వాదిస్తోంది. మరోవైపు హమాస్ పూర్తిగా లొంగిపోయినప్పుడే యుద్ధానికి ముగింపు పలుకుతామని ఇజ్రాయెల్ తెగేసి చెబుతోంది. కానీ, హమాస్ అందుకు నిరాకరిస్తోంది. తమ వద్ద బందీలుగా ఉన్న 50 మందిలో సగం మంది మాత్రమే బతికి ఉన్నారని చెబుతోంది. ప్రతిగా ఇజ్రాయెల్ యుద్ధాన్ని విరమించుకోవాలని, ఇక్కడి నుంచి తమ బలగాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తోంది.



## "విశ్వశాంతి స్కూల్" పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

- ఆపదలో ఉన్న స్నేహితులను మనమంతా ఆదుకోవాలి
- విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఎప్పటికీ మరువబోవద్దు

**భీమదేవరపల్లి, రాజముద్ర న్యూస్ :** ఆపదలో ఉన్న స్నేహితులను మనమంతా ఆదుకోవాల్సిన అవసరం ఉందని... విద్యాబుద్ధ నేర్పిన గురువులను ఎప్పటికీ మ-రువబోమని పలువురు పూర్వ విద్యార్థులు అభిప్రాయపడ్డారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూరు లోని శ్రీ విశ్వశాంతి ఉన్నత పాఠశాలలో 2005 -2006 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు 19 సంవత్సరాల తర్వాత పూర్వవిద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం శ్రీనివాస ఫంక్షన్ హాల్ లో నిర్వహించి కలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరు తాజా పరిస్థితులను, కుటుంబ వివరాలను సభావేదికగా పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రద్ధాభిమానాలతో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా చనిపోయిన ఉపాధ్యాయుడికి మిత్రుడికి శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు. కాలంతోనూ మారని మమకారాన్ని ప్రతిబింబించేలా, నాటి రోజుల్ని గుర్తు చేసుకుంటూ, ఒకరితో ఒకరు కౌగిలించుకుని ఆనందంతో ఉప్పొంగిపోయారు. ఈ జ్ఞాపకాల సందడి మధ్యే పాఠశాలలో వారికి బోధించిన ఉపాధ్యాయుల్ని ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థుల అభివృద్ధిని చూసి హర్షం వ్యక్తం చేస్తూ, ఇలాంటి సంఘటనలు అనుబంధాలను మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. సమ్మేళనం శుభాకాంక్షలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలతో రోజంతా ఉత్సాహంగా సాగింది. అనంతరం అందరికీ జ్ఞాపికలు పంపిణీ చేసి, విందు భోజనంతో కార్యక్రమాన్ని ముగించారు. ఈ వేడుకలో పూర్వ ఉపాధ్యాయులు ఆదిరెడ్డి, ఉమామహేశ్వర్, మహేందర్, మల్లేష్, కృష్ణ, రాజు, శ్రీనివాస్, రవి, మంజుల, పద్మ, జయ. పూర్వ విద్యార్థులు స్రవంతి, వైశాలి, పద్మ, రాధిక, లవన్, ప్రవీణ్, విద్యాసాగర్,అమర్నాథ్, కిషోర్, విక్రమ్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా హెచ్పీ రోడ్డులో ఆషాఢమాస బోనాల ఉత్సవాలు

**కూకట్‌పల్లి, రాజముద్ర న్యూస్ :** కూకట్ పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలో హెచ్పీ రోడ్డు లోని ఆషాఢమాసంలో మైసమ్మ గుడి ఆలయంలో ఆదివారం అత్యంత వైభవంగా అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ నేపథ్యంలో మాజీ సర్పంచ్ తూము శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ ఎల్లారావు, గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీ సంయుక్త కార్యదర్శి అశోక్ చారి, విజయ లాడ్జ ప్రొప్రైటర్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా అమ్మ వారికి బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. డివిజన్ పరిధిలోని ప్రజలందరు సుఖశాంతులతో సస్యశ్యామలంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు.



## జ్యోతిష్య బ్రహ్మ అవార్డు అందుకున్న ముని నాయక్

**హైదరాబాద్ :** నాంపల్లి లోని శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ లో నల్గొండ జిల్లా, తిరుమలగిరి సాగర్ మండల్, జాల్ తండా గ్రామానికి చెందిన జటావత్ లక్ష్మ తృతీయ కుమారుడు "జాటావత్ మునినాయక్ " కు జ్యోతిష్య బ్రమ్మ స్టేట్ అవార్డు" మదర్ తెరిస్సా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజెషన్ అధ్యక్షులు కృష్ణ మూర్తి, ముఖ్య అతిథిగా విచ్చేసిన బ్రమ్మనందం ఈ అవార్డు మునినాయక్ కు అందించారు. గత 10 సంవత్సరాలు సామాజిక, విద్య, వైద్య రంగాలలో తనదైన శైలిలో తన సేవలను అందిస్తూ జర్నలిస్ట్ గా తన బాధ్యతలను సక్రమంగా వినియోగిస్తూ తన వంతు కృషి చేస్తున్న మునినాయక్ కు ఈ అవార్డు అందించడం ఆనందముగా ఉన్నదని అన్నారు.

# రెచ్చిపోతున్న బైక్ రైడర్స్..



- బైకులపై స్టంట్స్ చేస్తూ హీరోల ఫీలైపోతున్న రైడర్స్
- హెల్మెట్ ధరించకుండా బైక్ పై ముగ్గురు ప్రయాణం
- లైసెన్స్ లేకుండా, ఓవర్ స్పీడ్‌తో వెళ్తూ సెల్ ఫోన్ మాట్లాడుతూ.. ప్రాణాలతో చెలగాటం
- అతివేగంతో వెళ్తున్న వ్యక్తులను గుర్తించి తగు చర్యలు చేపట్టాలి



**భీమదేవరపల్లి, రాజముద్ర న్యూస్ :** రకరకాల ద్విచక్ర వాహనాలతో యువత చేతిలో రయ్ రయ్ మంటూ ద్విచక్ర వాహనాలు దూసుకుపోతున్నాయి. మార్కెట్లో కి కొత్త వాహనం వచ్చిందా అంతే సంగతి అప్పు చేసి తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తూ వాహనాలు కొంటున్నారు. ఈ స్పోర్ట్స్ బైక్‌లను యమ క్రేజీ హార్స్ పవర్ ఎంత ఎక్కువ ఉంటే అంతగా జోష్. ఆ బైకులపై ఒక్కసారైనా రై మంటూ ఓ రౌండ్ కొట్టాలని యువత భావిస్తుంది. ఈ సరదా అప్పుడప్పుడు ప్రాణాలు తీస్తుంది. వివరాల్లోకి వెళితే భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామం లోని బస్టాండ్ నుండి మోడల్ స్కూల్ కి వెళ్లే రోడ్ల పై ఉదయం, సాయంత్రం యువత ద్విచక్ర వాహనాలు అతి వేగంగా నడుపుతూ చెలరేగిపోతున్నారు. యువత ఎవరి మాట వినడం లేదు. అంతేకాకుండా కనిపిస్తున్న బైక్ లపై స్టంట్స్ చేస్తూ హీరోల ఫీలైపోతున్నరు. ఆకాశమే హద్దుగా గాల్లో తేలిపోతున్నారు. అతివేగంగా వాయువులో కలిసిపోతున్నారు. ప్రాణాలతో చెలగాటం ఆడుతూ.. తల్లిదండ్రులకు కడుపుకోత మిగులుస్తున్నారు. ఇలాంటి సంఘటనలు జరిగినప్పటికీ యువత ప్రాణాలు కూడా కోల్పోయిన ఘటనలు జరిగాయని తెలిసినప్పటికీ కూడా యు-వతలో మార్పు రావడం లేదు. కాగా పోలీసులు ఆడపాదడపా వీరిని అదుపు చేస్తున్న ఆగడం లేదు. బైక్ రైడర్లలో ఎక్కువ శాతం విద్యార్థులే ఉండటం వల్ల విద్యార్థులు కావడంతో వారి భవిష్యత్తుకు ఎటువంటి కేసుల ద్వారా ఆటంకాలు, ఉండకూడదని. పోలీసులు పెద్ద మనసు చేసుకొని కౌన్సిలింగ్ చేసి తల్లిదండ్రులను మందలించి వదిలేస్తున్నారు. అంతే కాకుండా హెల్మెట్ ధరించకుండా ఒక్క ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణం చేస్తూ అతివేగంగా వెళ్తున్నారు. ప్రయాణిస్తున్న వాహనాన్ని వంకలుగా తింపుతూ ముందటి బాగానే ఉన్నా చక్రాన్ని హేండిల్‌తో లేపుతూ ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. హార్స్ పవరున్న బైక్ వెనక సీట్లో గర్ల్ ఫ్రెండ్, ఉందా ఇంకేముంది ఎంత స్పీడ్ వెళితే అంత కిక్ కానీ ఏ మాత్రం అదుపుతప్పిన ప్రాణాలు గాల్లో కలిసిపోవడమే తరచూ ఇటువంటి సంఘటనలు చాలా జరుగుతున్నాయి. అయినా అతి గారాబం చేసే తల్లిదండ్రులు తమ పిల్లలు బైకులు ఎలా నడుపుతున్నారో పసిగట్టలేక పోతున్నారు. పట్టుమని పాతికేళ్లు వయసు ఉండదు. కానీ ఎవరి చేతిలో చూసిన 200 సిసి బైక్ లే ఉంటున్నాయి. కనీసం లైసెన్స్ లేకుండా, ఓవర్ స్పీడ్‌తో వెళ్తూ సెల్ ఫోన్ మాట్లాడుతూ.. ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఇలా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని తెలిసికూడా యువత ఇలా ప్రవర్తిస్తున్నారు. కిక్కు కొట్టామా.. క్షణంలో అనుకున్న ప్రదేశానికి వెళ్ళిపోయామ అనేది చూసుకుం టున్నారు. తప్ప వెనక నుంచి, ముందు నుంచి వెళ్లే వాహన దారులకు ఇబ్బంది కలిగిస్తూ.. వారు ఎంత భయపడుతున్నారనేది అర్థం చేసుకోవడం లేదు. రహదారులపై ఓవర్ స్పీడ్‌గా వెళ్తున్న యువతపై పోలీసులు చర్యలు తీసుకోకపోవడంపై ఏంటని భీమదేవరపల్లి మండల ప్రాంత ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. అతివేగంతో వెళ్తున్న బైక్ రైడర్స్ ఎదురుగా వచ్చే వాహనాలకు ఇబ్బందులు కలిగిస్తుస్తూ.. భయభ్రాంతులకు గురి చేస్తూన్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారిపై పోలీసులు తనిఖీలు చేపట్టాలని, అతివేగంతో వెళ్తున్న వ్యక్తులను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## 25 ఏళ్ల పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

### గుర్తుకొస్తున్నాయి..' 25 ఏళ్ల తర్వాత ఒక్కచోటికి పూర్వ విద్యార్థులు..



**వలిగొండ, రాజముద్ర న్యూస్ :** 1999 - 2000 సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం యాదాద్రి జిల్లా వలిగొండ మండలం వెలువర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగింది. యోగ క్షేమాలను అడిగి తెలుసుకొని.. చిన్నానాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఆనాటి గురువులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు 25 ఏళ్ల అనంతరం ఆదివారం కలుసుకొని ఆత్మీయత పంచుకున్నారు. అప్పటి స్నేహితులు అందర్నీ కలిసి వారితో ముచ్చటిస్తూ.. అలనాటి జ్ఞాపకాలు నెమరువేసు కుంటుంటే.. ఆ అనుభూతి వర్ణణాతీతం. ప్రస్తుతం ఆయా రంగాల్లో సెటిల్ అయిన వారు తమ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. పాతిక సంవత్సరాల తరువాత అందరం ఒకే వేదిక వద్ద కలుసుకోవడంతో అందరు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థు లు పాల్గొన్నా రు. 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చదువు కున్న పాఠశాలకు కొంత అర్దిక సహాయం చేస్తామని హామీ ఇచ్చారు.

## ఎల్లారెడ్డి నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి ప్రాధాన్యత

### ఎమ్మెల్యే మదన్ మోహన్



**కామారెడ్డి జిల్లా, జులై 13 :** ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని విద్యలో అభివృద్ధి చెందిన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ తెలిపారు. విద్యను సమాజ అభివృద్ధికి మూలస్తంభంగా భావిస్తూ, నియోజకవర్గవ్యాప్తంగా పలు కీలక కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తాజాగా ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో రూ. 3.5 కోట్ల నిధులతో నిర్మిస్తున్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ (కేజీబీవీ) నిర్మాణ పనులను ఎమ్మెల్యే స్వయంగా సందర్శించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌లు, అధికారులతో సమావేశమై నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. నిర్మాణ నాణ్యతపై రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అదేవిధంగా,ఎమ్మెల్యే మదన్ మోహన్ మాట్లాడుతూ, రూ. 70 కోట్ల నిధులతో నిర్మిస్తున్న అడ్వాన్స్‌డ్ ఇన్ఫర్మేషన్ అండ్ ట్రైనింగ్ సెంటర్ పనులు తుది దశకు చేరుకున్నాయని, త్వరలో ప్రజలకు అందు బాటులోకి తీసుకురాబోతున్నామని తెలిపారు. ఇది విద్యార్థులు, యువతకు నూతన అవ కాశాల ద్వారాన్ని తెరచు తుంద న్నారు. రూ. 200కోట్లతో "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్" ఏర్పాటుకు సంబంధించిన పనులు త్వరలో ప్రారంభ మవుతాయని వెల్లడించారు. ఇది విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధికి, సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి దోహదపడు తుందని తెలిపారు. నియోజకవర్గంలోని అనేక ప్రభుత్వ పాఠశాలలకు మరమ్మతులు, వసతుల కల్పన కోసం నిధులు విడుదల చేసినట్లు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం పెరుగుతున్నదని, చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పిస్తున్నారని పేర్కొన్నారు." విద్యార్థులలో సమానత్వాన్ని సాధించేందుకు, ఆధునిక సదు-పాయాలతో ప్రభుత్వ పాఠశాలలను మెరుగు పరచడం మా ప్రధాన లక్ష్యం. ప్రతి విద్యార్థి, ప్రతి కుటుంబం నాణ్యమైన విద్య పొందాలి అనే సంకల్పంతో ముందుకు సాగుతున్నాం," అని ఎమ్మెల్యే మదన్ మోహన్ అన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్, టీచర్లు, కాంట్రాక్టర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, తాజా మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్, మార్కెట్ కమిటీ చైర్మన్, టౌన్ కాంగ్రెస్ నాయకులు, మండల సీనియర్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్ :** ఆషాఢ బోనాలను ప్రజలు ఘనంగా నిర్వహించుకోవాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ అన్నారు. ఆదివారం మైలార్ దేవ్ పల్లి డివిజన్ లోని మైలార్ దేవ్ పల్లి మెయిన్ విలేజ్ లో దుర్గాదేవి అమ్మవారిని ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు.



## కల్తీ కల్లుకు బలైన కుటుంబాలను పరామర్శించిన ఐలాపురం రాజశేఖర్

**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్ :** కూకట్‌పల్లి నియోజకవర్గం ప్రాంతం, హైదర్ నగర్ లోని షంషిగూడ కల్లు కంపౌండ్ లో కల్తీ కల్లు తాగి ఇప్పటి వరకు 9 మంది మ-రణించారు, కొంతమంది చికిత్స తీసుకుంటున్నారు. వారి కుటుంబాలను సీపీఎం పార్టీ కూకట్పల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో సీపీఎం పార్టీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్, కూకట్ పల్లి మండల కార్యదర్శి ఎం. శంకర్ లు పాల్గొని కుటుంబాలను పరామర్శించారు వాళ్లు మాట్లాడుతు మృతుల కుటుంబాలను ఆదుకోవాలని, ప్రయివేట్ హాస్పిటల్ లలో వైద్యం తీసుకుంటున్న బాధితులకు ఉచితంగా మెరుగైన వైద్యం అందించాలని అన్నారు.

## రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ధన్యవాదాలు

### మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దూదేకుల సంఘం అధ్యక్షులు భాష



**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దూదేకుల సంఘం అధ్యక్షులు భాష ధన్యవాదాలు తెలియజేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించి పెద్దపీట వేసిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీకి ఎప్పుడు రుణపడి ఉంటామని తెలిపారు. అలాగే రాబోయే ఎన్నికలలో దూదేకుల ను గుర్తించి అర్హులు అయినా వారికి ప్రాధాన్యత కల్పించాలని కోరుతూ దూదేకుల కులస్తులకు అన్ని రకాలుగా ఆదుకోవాలని మేడ్చల్ జిల్లా మైనారిటీ ప్రజల తరుపున కోరుతున్నామని ఒక ప్రకటన తెలిపారు.



## బోనం మెత్తిన ఎమ్మెల్యే పోచారం

**కామారెడ్డి జిల్లా , జులై 13 :** బాన్సువాడ ఆషాఢ మాసం సందర్భంగా జిల్లాలో బోనాల ఉత్సవాలు కొనసాగు తున్నాయి. ఇందులో భాగంగా బాన్సువాడలో ఆదివారం బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి సతీసమేతంగా బోనం ఎత్తుకున్నారు. పట్టణంలోని సంగమేశ్వర కాలనీలో బోనాల పండుగలో పోచారం శ్రీనివాస్ రెడ్డి, భార్య పుష్పతో కలిసి సంబరాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఆషాఢమాసంలో బోనాల ఊరేగింపు అనాదిగా వస్తున్న ఆచారమన్నారు. ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని.. పాడిపంట బాగుండాలని కోరుతూ మహిళలు గ్రామాల్లో బోనాల తీస్తారని వివరించారు. రుద్రూర్ మండల కేంద్రంలో నిర్వహించిన బోనాల సంబరాల్లో పోచారం శ్రీనివాస్ రెడ్డితో పాటు పోచారం భాస్కర్ రెడ్డి పాల్గొని బోనమెత్తారు. బోనాల పండుగను ప్రజలు అత్యంత ఉత్సాహంతో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కార్యక్రమంలో పోచారం సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## నిద్రపోయే ముందు

# వాటర్ తాగవచ్చా?

నీరు ప్రతి ఒక్కరికి జీవనాధారం. ఎక్కువగా నీరు తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి చాలా ప్రయోజనాలు ఉన్నాయి. డ్కెలీ సరిపడా నీరు తాగడం వల్ల సగం అనారోగ్య సమస్యల నుంచి బయట పడవచ్చని నిపుణులు చెబుతుంటారు. నీరు తాగడం వల్ల జీవక్రియ ఆరోగ్యంగా ఉండటంతో పాటు శరీరంలోని భాగాలకు కూడా ఆక్సిజన్ సరిగ్గా లభిస్తుంది. ముఖ్యంగా ఉదయం లేచిన వెంటనే గ్లాసు గోరువెచ్చని నీరు తాగితే రోజంతా యాక్టివ్‌గా ఉండటంతో పాటు ఆరోగ్యంగా ఉంటారు. కానీ చాలా మంది పనిలో బిజీ అయిపోయి తక్కువగా వాటర్ తీసుకుంటారు. రోజులో ఏ సమయంలో అయిన నీరు తీసుకోవడం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండా ఆరోగ్యంగా ఉంటారు. కొందరు రోజంతా వాటర్ ఎక్కువగా తాగకుండా నిద్రపోయే ముందు తాగుతుంటారు. అయితే నిదపోయే ముందు నీరు అధికంగా తాగడం అసలు ఆరోగ్యానికి మంచిదేనా? అనే సందేహంలో పడుతుంటారు. ఇంతకీ నిద్రపోయే ముందు నీరు తాగవచ్చా? తాగితే ఏమవుతుందో ఈ స్టోరీలో తెలుసుకుందాం. నిద్రపోయే ముందు నీరు తాగడం వల్ల బాడీ హైడ్రేట్‌గా ఉంటుందని నిపుణులు అంటున్నారు. ఎవరైతే డీహైడ్రేషన్ సమస్యతో బాధపడుతున్నారో వారు నిద్రపోయే ముందు నీరు తాగడం వల్ల బాడీకి మంచి జరుగుతుంది. అలాగే నిద్రపోయే ముందు నీరు తాగడం వల్ల ఉదయం లేచిన వెంటనే శరీరంలోని వ్యర్థాలు మూత్రం ద్వారా బయటకు వెళ్లిపోతాయి. అంతే కాకుండా మలవిసర్జన కూడా ఫ్రీగా అవుతుంది. కొందరు ఎక్కువ ఒత్తిడికి, ఆందోళనకు గురవుతుంటారు. ఇలాంటి వారు నిద్రపోయే ముందు నీరు తాగడం వల్ల వీటి నుంచి విముక్తి పొందుతారు. అలాగే మానసిక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. అయితే చల్లని నీరు కంటే గోరువెచ్చని నీరు నిద్రపోయే ముందు తాగితే ఆరోగ్యానికి ఇంకా మంచిది. వేడి నీరు జీర్ణక్రియ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో బాగా ఉపయోగపడుతుంది. నిద్రపోయే ముందు నీరు తాగడం వల్ల ప్రయోజనాలే కాదు.. నష్టాలు కూడా ఉన్నాయని నిపుణులు అంటున్నారు. పడుకునే ముందు అధికంగా నీరు తాగడం వల్ల ఎక్కువగా మూత్రానికి వెళ్లాల్సి వస్తుంది. దీంతో పదే పదే లేవడం వల్ల నిద్రకు భంగం కలుగుతుంది. హాయిగా పడుకున్న తర్వాత నిద్రకు ఆటంకం కలిగితే మానసిక సమస్యలు వస్తాయని నిపుణులు అంటున్నారు. దీంతో నిద్రలేమి వచ్చే ప్రమాదం కూడా ఉంటుంది. నిద్ర సరిగ్గా లేకపోతే గుండె పోటు వచ్చే ప్రమాదాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి నిద్రకు ఆటంకం కలిగించే విధంగా అధికంగా నీరు తాగవద్దు. నిద్రపోయే గంట ముందు నీరు తాగితే మూత్ర విసర్జనకు అంత ఇబ్బంది ఉండదు. అయితే నిద్రపోయే ముందు గ్లాసు వరకు నీటిని తీసుకోవడం మంచిది. అవసరమైతే పండ్లు రసాలు వంటివి తాగితే ఇంకా ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. నిద్రపోయేటప్పుడు జ్యూస్ తాగడం వల్ల యంగ్ లుక్‌లో కనిపిస్తారు.

# ఉసిరిరసంతో మధుమేహానికి చెక్





ఆరోగ్యానికి ఉసిరి ఎంతో మేలు చేస్తుంది. దీనిని డ్కెలీ డ్కెట్‌లో చేర్చుకోవడం వల్ల బోలెడన్నీ ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతుంటారు. రోజూ ఉసిరి కాయను తినడం వల్ల ఆరోగ్యం మెరుగు పడటంతో పాటు జుట్టు, చర్మం ఆరోగ్యంగా ఉంటుందని నిపుణులు అంటున్నారు. ఉసిరిలో ఎన్నో ఔషధ పోషకాలు కూడా ఉన్నాయి. ఇవి ఎలాంటి అనారోగ్య సమస్యలు రాకుండా శరీర ఆరోగ్యాన్ని కాపాడటంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. అయితే సీజనల్‌గా ఈ ఉసిరి ఎక్కువగా దొరుకుతుంది. ముఖ్యంగా ఈ సీజన్‌లో అయితే మార్కెట్లో తాజా ఉసిరికాయలు లభిస్తాయి. కొందరు ఉసిరితో పచ్చళ్లు కూడా చేసి పెట్టుకుంటారు. వీటిని తినడం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుందని భావిస్తారు. అయితే ఉసిరి కాయను డ్కెరెక్ట్‌గా తినడమే కాకుండా వీటితో జ్యూస్ చేసి కూడా తాగుతుంటారు. ఈ జ్యూస్‌ను తాగడం వల్ల ఆరోగ్యానికి చాలా ప్రయోజనాలు ఉన్నాయట. ముఖ్యంగా మధుమేహం ఉన్నవారికి ఈ జ్యూస్ బాగా ఉపయోగపడుతుంది. మరి మధుమేహులు ఈ జ్యూస్ తాగడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయో ఈ స్టోరీలో తెలుసుకుందాం. ఈ రోజుల్లో చాలామంది మధుమేహంతో ఇబ్బంది పడుతున్నారు. దీని బారిన పడితే ఆరోగ్య విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. లేకపోతే కొన్ని సార్లు మరణం కూడా సంభవించే అవకాశం ఉంటుంది. దీని బారిన పడిన వారు ముఖ్యంగా ఆహార విషయంలో అయితే చాలా అనిగి మనిగి ఉండాలి. ఆరోగ్యానికి మేలు చేసే ఆహారాలు మాత్రమే తీసుకోవాలి. స్వీట్లు, కొన్ని పండ్లు, తీపి పదార్థాల జోలికి అసలు వీరు పోకూడదు. అయితే మధుమేహం ఉన్నవారు ఉసిరి రసాన్ని తాగితే రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. రోజూ ఉదయం పూట ఉసిరి రసాన్ని తాగితే మధుమేహులకు మంచి ఫలితం ఉంటుందట. అయితే ఈ ఉసిరి జ్యూస్‌లో పసుపు, తేనె కలిపి తాగితే ఇంకా ఆరోగ్యానికి మేలు చేస్తుందని నిపుణులు అంటున్నారు. కేవలం మధుమేహులకు మాత్రమే కాకుండా గుండె ఆరోగ్యానికి కూడా ఉసిరి జ్యూస్ సాయపడుతుంది. డ్కెలీ ఉసిరి రసం తాగడం వల్ల రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. జ్వరం, దగ్గు, జలుబు వంటి సమస్యల నుంచి విముక్తి కల్పిస్తుంది. ఆస్తమా ఉన్నవారికి ఉసిరి బాగా ఉపయోగపడుతుంది. అయితే కేవలం వీటికే కాకుండా జుట్టు, చర్మ ఆరోగ్యానికి కూడా ఉసిరి బాగా పనిచేస్తుంది. ఈ ఉసిరి ప్యాక్‌ను జుట్టుకు అప్లై చేస్తే జుట్టు మృదువుగా తయారవుతుంది. ఉసిరి కాయలను ఎండలో ఎండబెట్టి పౌడర్ చేసుకుని నిల్వ ఉంచుకోవాలి. ఈ పౌడర్‌ను తలకు పట్టిస్తే జుట్టు నిగనిగలాడుతుంది. అలాగే ఉసరి కాయలను తిన్నా లేదా జ్యూస్ తాగిన చర్మం కూడా మెరుగుపడుతుంది. ఉసిరి రసంలో ఎక్కువగా విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మ, జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ప్రధాన పాత్ర వహిస్తాయి. కాబట్టి సీజనల్‌గా దొరికనప్పుడు అయిన కూడా ఉసిరిని డ్కెలీ తినడం ఆరోగ్యానికి మంచిది.



పిల్లలు మంచి పద్ధతిలో ఎదగడంలో, మంచి సంస్కారం పొందడంలో కుటుంబ సభ్యుల పాత్ర ఎంతో కీలకం. పిల్లలు తల్లిదండ్రుల నుండి మాత్రమే కాకుండా కుటుంబ సభ్యులందరి నుండి ఏదో ఒక గుణాన్ని నేర్చుకుంటారు. ముఖ్యంగా ఇంట్లో పెద్దలు ఉంటే అది ఒక విధంగా ఆశీర్వాదం లాంటిదే. పిల్లలకు మంచి సంస్కారాన్ని అందించడంలో ఇవి ముఖ్యపాత్ర పోషిస్తాయి. తాతయ్యలతో పెరిగే పిల్లలు ఖచ్చితంగా వారి నుండి కొన్ని లక్షణాలను నేర్చుకుంటారు, అవి ఏమిటో తెలుసుకుందాం. సీనియర్ సిటిజన్లు మనంత చదువుకోకపోయినా జీవితానుభవం కొండంత కలిగి ఉంటారు. అతను జీవితంలోని ఏడు పతనాలను చాలాసార్లు చూశాడు , ఎదుర్కొన్నాడు. ఈ పరిస్థితుల్లో వారికి ఉండే ధైర్యం, నిజాయితీ, సహనం వంటి లక్షణాలను కూడా పిల్లలు తమ జీవితానుభవాల నుంచి నేర్చుకుంటారు. ఖాళీ సమయం దొరికినప్పుడు టీవీ, మొబ్కెల్ ఫోన్లలో ఎక్కువ సమయం కేటాయిస్తాం. కానీ మా తల్లిదండ్రులు తమ ఖాళీ సమయాన్ని తోటలో, వంట చేస్తూ, సంగీతం వింటూ గడుపుతారు. తాతముత్తాతల ఈ గుణాలను చూసి మనవాళ్ళు వారిని అనుకరించడం మొదలు

# ఈ ఆలోచనలను పెద్దలు పిల్లలకు నేర్పించవచ్చు..!

పెడతారు. జీవితం కేవలం మొబ్కెల్ ఫోన్ మాత్రమే కాదని పిల్లలు తమ పెద్దల నుండి నేర్చుకుంటారు. మీ ఇంట్లో పెద్దలు ఉంటే, మీరు వారిని పట్టించుకోకూడదు లేదా పట్టించుకోకూడదు. పిల్లలు ఈ ప్రవర్తనలను వారి తల్లిదండ్రుల నుండి నేర్చుకుంటారు. తరువాత, మీరు పెద్దయ్యాక, పిల్లలు మీతో అలాగే ప్రవర్తించవచ్చు. కాబట్టి మీరు వారి పెద్దల పట్ల శ్రద్ధ వహిస్తున్నప్పుడు మీ పిల్లలను ఎలా చూసుకోవాలి? వృద్ధాప్యంలో మన తల్లిదండ్రులను ఎలా చూసుకోవాలి? దాని గురించి పాఠం నేర్చుకోండి. పిల్లలకు మంచి సంస్కారాన్ని అందిస్తుంది. పని నుంచి ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు పిల్లలతో ఎక్కువ సమయం గడిపే ఓపిక ఉండదు. కానీ వాళ్లతో పోలిస్తే తాతయ్యలకు ఓపిక ఎక్కువ. ప్రేమ ప్రాముఖ్యత అందరికీ తెలిసిందే. కృతజ్ఞతతో జీవితాన్ని ఎలా గడపాలనే గుణాన్ని కలిగి ఉంటారు. పిల్లలు ఇవన్నీ పెద్దల దగ్గర నేర్చుకుంటారు. మన గత తరాలు ఎన్నో చారిత్రాత్మక సంఘటనలకు సాక్ష్యంగా ఉన్నాయి. వారికి దశాబ్దాల క్రితం నాటి కథలు తెలుసు. పిల్లలు తమ తాతయ్యలతో ఉన్నప్పుడు, వారు తమ మనవళ్లకు ఈ కథలను చెబుతారు. దీనివల్ల పిల్లలకు చరిత్రపై అవగాహన పెరుగుతుంది. కాలం గడుస్తున్న కొద్దీ మనమందరం ఆధునిక యుగంలోకి వెళ్తున్నాం. కానీ మన ముందు తరాలు ఇప్పటికీ సంప్రదాయాలను కొనసాగిస్తున్నారు. మా కుటుంబ సంస్కృతి , సంప్రదాయాలు మా తల్లిదండ్రులకు బాగా తెలుసు. అందువలన తాతలు తమ మనవళ్లకు వీటిని నేర్పిస్తారు. దీనివల్ల మన సంప్రదాయాలను తర్వాతి తరానికి అందించవచ్చు.

# యుక్తవయస్సు వచ్చిన కొడుకుపట్ల తల్లి వైఖరి ఇలా ఉండాలి..!



పిల్లలు పెరిగి పెద్దవారై వెళ్లిపోతారు. మన కళ్లముందే ఎదుగుతున్న పిల్లలను చూస్తుంటే.. ఛాతీ వరకు పెరిగే సరికి పిల్లలు ఇంత త్వరగా ఎదిగిపోయారేమో అనిపిస్తుంది. యుక్తవయస్సు శారీరకంగా , మానసికంగా మారుతుంది. అందువల్ల, వయస్సు వచ్చిన కొడుకు విషయంలో తల్లి చాలా జాగ్రత్తగా ఉండాలని , ఆమె ఎలా ప్రవర్తించాలో చాణక్యుడు సలహాలు ఇచ్చాడు. యుక్తవయసులో ఉన్న కొడుకును పెంచేటప్పుడు జాగ్రత్తగా ఉండటం ముఖ్యం. చిన్న విషయాలకు అమ్మ తిట్టడం, కొట్టడం వంటివి చేయకూడదు. ఈ కుటుంబంలో తనకు కూడా ముఖ్యమైన స్థానం ఉందని భావించే విధంగా ఇంటి వాతావరణం ఉండాలి. పిల్లల విషయంలో జాగ్రత్తలు అతిగా ఉండకూడదు. ప్రేమించడం నిజం, కానీ ఈ సమయంలో అది విచక్షణతో వ్యవహరించాలి. కొడుకు ఏది అడిగినా ఇవ్వడం సరికాదు. తక్కువ డబ్బుతో పిల్లలకు వస్తువులు ఇచ్చినా పిల్లలకు ఎంత ఖర్చవుతుందో అర్థం కావడం లేదు. ఆ సమయంలో ఏది అవసరమో అది ఇవ్వడం మంచిదని చాణక్యుడు చెప్పాడు. టీనేజ్ కొడుకు దగ్గర పడుకోవడం సరికాదు. ఈ విషయంలో జాగ్రత్త అవసరం. తల్లిదండ్రులు తమ కొడుకుకు డబ్బులు ఇవ్వడం సరికాదు. పాఠశాల వయస్సులో అతని స్నేహితులను , వారి ప్రవర్తనను తెలుసుకోవడం చాలా ముఖ్యం. ఛాతీ ఎత్తుకు ఎదిగిన కొడుకు ముందు భార్యాభర్తలు సరసాలు ఆడకూడదు. దీని వల్ల కొడుకు మనసు చంచలంగా మారే అవకాశం ఉంది. ఇలా కూడా చేస్తే తప్పేంటి అనే ఫీలింగ్ లో కొడుకు దారి తప్పిన సందర్భాలు ఎక్కువే అని చెప్పొచ్చు. ఎదిగిన కొడుకు ముందు తల్లిదండ్రులిద్దరూ గొడవ పడటం సరికాదు. పిల్లల ముందు ఒకరినొకరు తిట్టుకోవడం వల్ల తల్లిదండ్రులు బాధపడతారు. కానీ మీ గొడవలు మీ కొడుకు పెళ్లి విషయంలో చేదుగా అనిపిస్తాయి. కొడుకును చదివించాలనుకుంటే వీల్కెనంత వరకు చదివించండి. పిల్లల చదువు విషయంలో ఏ కారణం చేతనూ అడ్డుకోకూడదు. చదువులు సగంలో ఆపేస్తే పిల్లల భవిష్యత్తు నాశనం అవుతుంది. అందువల్ల పిల్లలను విద్యారంగంలో , ఆసక్తిలో పాల్గొనేలా ప్రోత్సహించమని చాణక్యుడు చెప్పాడు. కొడుకు తన సొంత హోదాలో ఉన్న అమ్మాయిని వివాహం చేసుకోవడం మంచిది. చాలా ధనవంతుడు లేదా చాలా పేద ఇంటి నుండి కోడలిని వివాహం చేసుకోవడం సరికాదు. ధనిక కుటుంబానికి కోడలిగా వస్తే ఆమెను హ్యాండిల్ చేయడం కష్టం. అదీకాక ఆ ఇంటిలోని స్త్రీ నిరుపేద అయితే ఆమె కుటుంబాన్ని నువ్వు చూసుకోవాలి. కాబట్టి ఈ విషయంలో కొడుకు అభిప్రాయం అడగడం మంచిది.

రాజధానిలో చెరువుల ఆక్రమణలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతోంది. నాలాల్లో కట్టిన ఇళ్లను కూడా కూల్చుతోంది. పార్కులు, లేఅవుట్ ఖాళీ స్థలాలు, రహదారులను ఆక్రమించి నిర్మించిన భవనాలకూ హైడ్రా నుంచి ముప్పు ఉన్నట్టే. ఈ నేపథ్యంలో.. కొత్తగా ఇల్లు కొనేవారు జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు. కొనుగోలు చేయాలనుకున్న ఇల్లు.. నీటి వనరులకు దగ్గరగా ఉన్నట్లయితే.. ఆ ప్రాంతం ఎఫ్‌టీఎల్‌లో ఉందా?, బఫర్ జోన్‌లో ఉందా? అనే ప్రశ్నలకు సమాధానం తెలుసుకోవాలంటున్నారు. అనుమతి మంజూరు చేసిన సంస్థలను (జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ లేదా ఇతర మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో) సంప్రదించి.. దస్త్రాలను సరి చూసుకోవాలని సూచిస్తున్నారు.

– హైదరాబాద్



# దగ్గర్లో చెరువుందా..

## దస్త్రాలు పరిశీలించాల్సిందే

### ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉంటే కూల్చేస్తోన్న హైడ్రా

## చెక్ చేసుకోండిలా..

హెచ్ఎండీఏ వెబ్‌సైట్‌లోని లేక్స్ హెచ్ఎండీఏ గవర్నమెంట్ ఇన్ సైట్‌లోకి వెళ్లాలి. అందులో జిల్లా, మండలం, గ్రామం సెలెక్ట్ చేసుకొని మీ సర్వేనంబరు ఆధారంగా ఆ ఊరిలోని అన్ని చెరువుల వివరాలు తెలుసుకోవచ్చు. ఎఫ్‌టీఎల్ కాలమ్‌లోని క్లిక్ అని బ్లూ కలర్ ఉంటుంది. దాన్ని క్లిక్ చేయగానే మ్యాప్ ఓపెన్ అవుతుంది. ఎఫ్‌టీఎల్ వరకు చెరువు విస్తీర్ణం ఎంత ఉంది.. పరిసరాల్లో ఏం ఉన్నాయో కూడా కన్పిస్తుంది. తర్వాత బ్యాక్‌కి వచ్చి క్యాడస్ట్రల్ మీద క్లిక్ చేస్తే మళ్లీ మ్యాపు ఓపెన్ అవుతుంది. ఆ చెరువు ఏయే సర్వే నెంబర్ల పరిధిలో ఉందో స్పష్టంగా తెలుస్తుంది. మ్యాప్‌లో నీలి రంగు లైన్‌తో ఉన్నది ఎఫ్‌టీఎల్ పరిధి, దాని పక్కనే రెడ్‌కలర్‌తో ఉన్నదే బఫర్‌జోన్. చెరువు కట్ట ఆరెంజ్ కలర్‌తో ఉంటుంది. దాని ప్రకారం చెరువుకు ఎటు వైపు మీ స్థలం లేదా అపార్ట్‌మెంట్, విల్లా ఎక్కడ ఉందో చెక్ చేసుకోవచ్చు.



## అనుమతులు ఉన్నప్పటికీ..:

ఇరిగేషన్ శాఖ ఎన్‌వోసీతో జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ అనుమతులు ఇచ్చిన లేఅవుట్లు, అపార్ట్‌మెంట్ల విషయంలో కూడా వివాదాలు నడుస్తున్నాయి. అనుమతులు ఉన్నట్లు తేలినా.. మరోసారి చెక్‌చేసుకోవాలి. హెచ్‌ఎండీఏ పరిధిలో అయితే మాస్టర్‌ప్లాన్–2030 తీసుకోవాలి. మీ ప్లాటుకు చెరువు లేదా జలవనరులు ఎంత దూరంలో ఉన్నవి కచ్చితంగా తెలుసుకోవాలి. మాస్టర్‌ప్లాన్‌లో జోన్ కేటగిరి కూడా ముఖ్యమే. ఉదాహరణకు ఇండస్ట్రియల్ జోన్‌లో నివాసాలకు అనుమతించరు. తర్వాత ఇల్లు కట్టుకోవాలంటే జోన్ మార్పు కోసం అదనంగా భారీగా ఫీజులు చెల్లించాలి. చెరువు సమీపంలో మీ స్థిరాస్తి ఉంటే మరింత నిశితంగా పరిశీలించాలి. సమీపంలోని రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి మీ సర్వేనంబరు ఆధారంగా చెరువు ఎఫ్‌టీఎల్ లేదా బఫర్–జోన్ పరిధిలో ఉన్నారా...లేదా తెలుసుకోవాలి.

పాత లేఅవుట్లలోని పార్కు స్థలాలు, ఎమినిటీస్ కోసం వదిలిన ఖాళీ స్థలాలను కొందరు బైనంబర్లతో అమాయకులకు విక్రయిస్తున్నారు. బై నంబర్లతో రిజిస్ట్రేషన్ చేసే ప్లాట్ల విషయంలో ఈ జాగ్రత్త తప్పనిసరి. కొందరు సర్వే నంబర్లతో కాకుండా.. ఇంటి నంబర్లతో రిజిస్ట్రేషన్ చేయిస్తామంటారు. లేఅవుట్‌లోని ఖాళీ స్థలాల్లో ఇళ్లు నిర్మించి, వాటికి అడ్డదారిలో ఇంటి నంబర్లు తీసుకుని,ఇతరులకు రిజిస్ట్రేషన్ చేయిస్తుంటారు. అలాంటి వాటిపై ప్రభుత్వం ఎప్పుడైనా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. నాలాల పక్కన బఫర్ జోన్‌ను ఖాళీగా వదిలి, తర్వాత ఇళ్లను నిర్మించుకోవాలి. హద్దు వరకు పిల్లర్లు వేసి, ప్రహరీలు నిర్మించిన అపార్ట్‌మెంట్లలో ఇళ్లు కొంటే మోసపోయినట్టే. బఫర్ జోన్‌లోని కట్టడాలను ఏ క్షణాన్నైనా సర్కారు తొలగిస్తుంది. భారీ వర్షాల సమయంలో.. ఆ భవనం కూలిపోయే ప్రమాదం కూడా ఉంటుంది. పార్కులు, లేఅవుట్లలో వదిలే ఖాళీ స్థలాలకు పక్కనున్న ప్లాట్ల కొనుగోలు విషయంలో.. స్థలం కొలతలను ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలి. ఖాళీ స్థలాన్ని కలిపి, ఇంటి విస్తీర్ణాన్ని పెంచి అమ్మేందుకు కేటుగాళ్లు ప్రయత్నిస్తుంటారు.



## ఏటీఎంల్లో రూ.500 నోట్లు

# నిలిపివేయాలని ఆర్‌బీఐ కోరిందా?

### ఇందులో నిజమెంత?

అమాయక ప్రజల్ని మోసగించడమే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు దుష్ప్రచారం కొనసాగిస్తున్నారు. నకిలీ సమాచారం వ్యాప్తినే ఆయుధంగా చేసుకొని ప్రజల బ్యాంకు ఖాతాలను లూటీ చేస్తున్నారు. తాజాగా ఏటీఎంల ద్వారా రూ.500 నోట్ల పంపిణీని సెప్టెంబర్ నాటికి నిలిపివేయాలని బ్యాంకులను ఆర్‌బీఐ ఆదేశించినట్లుగా వ్యాప్తి చేస్తున్న నకిలీ వార్తలను కేంద్రం ఖండించింది. ఇందులో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేసింది. వాట్సప్ ద్వారా ఈ అంశంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. ఇలాంటి సమాచారం పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచిస్తూ పీఐబీ 'ఫ్యాక్ట్‌చెక్' విభాగం 'ఎక్స్'లో పోస్టు పెట్టింది. రూ.500 నోట్లు చట్టబద్ధంగా చెలామణిలో కొనసాగుతాయని తేల్చి చెప్పింది. ఇలాంటి దుష్ప్రచారాన్ని నమ్మొద్దని ప్రజలను కోరింది. ఏదైనా వార్తను విశ్వసించడం లేదా ఇతరులకు షేర్ చేసే ముందు అధికారిక వర్గాల నుంచి ధ్రువీకరించుకోవాలని విజ్ఞప్తి చేసింది.

# 'ఉప్పుతో ముప్పు'..

## మోతాదుకు మించి వినియోగం


దేశంలో మోతాదుకు మించి ఉప్పు వినియోగం ఉంటోందని, దీని ప్రతికూల ఫలితాలు చాపకింద నీరులా వ్యాపిస్తున్నాయని తాజా అధ్యయనం పేర్కొంది. హైపర్‌టెన్షన్, స్ట్రోక్, గుండె జబ్బులు, మూత్రపిండాల వ్యాధులతో బాధపడేవారిలో ముప్పు మరింత పెంచుతోందని ఐసీఎంఆర్‌కు చెందిన 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమిడమాలజీ' శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఉప్పు వినియోగం తగ్గించే ప్రయత్నాల్లో భాగంగా అధ్యయనం చేయడంతో పాటు తక్కువ సోడియం ఉన్న ప్రత్యామ్నాయ ఉప్పుపై దృష్టి సారిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనల ప్రకారం.. ఓ వ్యక్తి రోజులో 5గ్రాముల కంటే తక్కువ ఉప్పు తీసుకోవాలి. కానీ, భారత్‌లో పట్టణ ప్రాంతాల ప్రజలు రోజుకు 9.2 గ్రాములు తీసుకుంటుండగా, గ్రామీణ ప్రాంతాల్లో ఈ వినియోగం 5.6 గ్రాములుగా ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి.

### సోడియానికి బదులు..

ఉప్పులోని సోడియం క్లోరైడ్‌లో కొంతభాగాన్ని పొటాషియం లేదా మెగ్నీషియం లవణాలతో భర్తీ చేయడం ఆశాజనకంగా కనిపిస్తోందని ఈ అధ్యయనానికి నేతృత్వం వహించిన ఎన్ఐఈ సీనియర్ శాస్త్రవేత్త డా.శరణ్ మురళి పేర్కొన్నారు. సోడియం తక్కువ తీసుకోవడం.. రక్తపోటును తగ్గించడంతోపాటు గుండె పనితీరును మెరుగుపరుస్తుందన్నారు. ముఖ్యంగా హైపర్‌టెన్షన్‌తో బాధపడేవారికి ఎంతో దోహదం చేస్తుందని చెప్పారు. రక్తపోటు దాదాపు 7/4 ఎంఎంహెచ్‌జీ తగ్గుతుందని.. ఈ చిన్న మార్పు చాలా పెద్ద ప్రభావం చూపుతుందన్నారు. ఐసీఎంఆర్ సాయంతో తెలంగాణ, పంజాబ్‌లలో మూడేళ్ల వ్యవధితో కూడిన అధ్యయనాన్ని ఎన్ఐఈ ప్రారంభించింది. రక్తపోటు ఉన్న వ్యక్తుల్లో ఉప్పు తగ్గింపు ప్రభావాన్ని అంచనా వేయడం, దీనిపై కౌన్సిలింగ్ ఇవ్వడం వంటి లక్ష్యాలతో దీన్ని చేపట్టినట్లు డా.గణేశ్ కుమార్ వెల్లడించారు. ప్రస్తుతం అధ్యయనం తొలి ఏడాదిలో ఉందని, క్షేత్రస్థాయి సన్నద్ధత, అంచనాలపై పనిచేస్తున్నామని చెప్పారు. దీనిపై గ్రామీణ ఆరోగ్య కార్యకర్తలతో కలసి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.

### లభ్యత తక్కువే..

మార్కెట్‌లో తక్కువ సోడియం ఉప్పు (%జూజూ%) లభ్యత? ధర ఎలా ఉందనే దానిపై చెన్నైలో 300 రిటైల్ దుకాణాల్లో ఎన్ఐఈ సర్వే చేపట్టింది. 28శాతం రిటైల్ దుకాణాల్లో, 52 శాతం సూపర్ మార్కెట్లలో లభ్యమవుతుండగా.. కేవలం 4శాతం చిన్న కిరాణా దుకాణాల్లోనే ఇది అందుబాటులో ఉన్నట్లు తేలింది. అంతేకాదు, సాధారణ ఉప్పు ధర 100గ్రాములకు రూ.2.7 ఉండగా.. ఎల్ఎస్ఎస్ ధర రూ.5.6గా ఉందని వెల్లడైంది. తక్కువ సోడియం కలిగిన ప్రత్యామ్నాయాలపై సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నామని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.






# స్వల్ప ఛేదనలో భారత్ తడబాటు




### లక్ష్యం 193.. ప్రస్తుతం 58/4
### రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 192 ఆలౌట్
### విజృంభించిన సుందర్

లండన్ : భారత్-ఇంగ్లాండ్ మూడో టెస్టు రసవత్తర ముగింపు దిశగా సాగుతోంది. 193 పరుగుల చిన్న లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్.. నాలుగో రోజు, ఆదివారం ఆట ముగిసే సమయానికి 58 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది. రాహుల్ (33 బ్యాటింగ్‌బీ 47 బంతుల్లో 6ఐ4) పోరాడుతున్నాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 2/0తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లాండ్.. 192 పరుగులకే ఆలౌటైంది. వాషింగ్టన్ సుందర్ (4/22), సిరాజ్ (2/31), బుమ్రా (2/38) ఆతిథ్య జట్టు పతనాన్ని శాసించారు. రూట్ (40బీ 96 బంతుల్లో 1ఐ4) టాప్ స్కోరర్. చివరి రోజు తొలి గంటలో రాహుల్, పంత్ ఎలా ఆడతారన్నదే మ్యాచ్‌లో కీలకం కానుంది.

#### ఛేదనలో తడబడ్డారిలా..

లక్ష్యం చిన్నదే అయినా.. ఛేదన అంత తేలిక కాదని భారత్‌కు త్వరగానే అర్థమైంది. ఇంగ్లాండ్ పేసర్లు పదునైన పేస్‌తో పరీక్షించారు. రెండో ఓవర్లోనే జైస్వాల్ (0)ను ఔట్ చేయడం ద్వారా ఆర్చర్ పతనాన్ని ఆరంభించాడు. ఇంగ్లిష్ బౌలర్లు ఇబ్బంది పెడుతున్నా రాహుల్, కరుణ్ నాయర్ (14) నిలవడంతో ఓ దశలో భారత్ 41/1తో కుదురుకున్నట్లే కనిపించింది. కానీ 17 పరుగుల వ్యవధిలోనే మూడు వికెట్లు కోల్పోయి చిక్కుల్లో పడింది. కార్స్ తన వరుస ఓవర్లలో కరుణ్, గిల్ (6)లను వికెట్ల ముందు దొరకబుచ్చుకుని భారత్‌ను దెబ్బతీశాడు. నాలుగో రోజు ఆఖరి ఓవర్లో నైట్ వాచ్‌మన్ ఆకాశ్‌దీప్ (1)ను స్టోక్స్ బౌల్డ్ చేశాడు. ఆదివారం ఇంగ్లిష్ పేసర్లను ఎదుర్కొని నిలవడం భారత బ్యాటర్లకు సవాలే.

#### మెరుగైన ఆరంభం

నాలుగో రోజును టీమ్‌ఇండియా గొప్పగానే ఆరంభించింది. పేసర్ సిరాజ్ విజృంభించడంతో లంచ్ వేళకు ఇంగ్లాండ్‌ను 98/4కు పరిమితం చేసి మెరుగైన స్థితిలో నిలిచింది. మూడో రోజు ఆఖరి ఓవర్ నాటకీయంగా సాగగా.. ఆదివారం కూడా మైదానంలో అదే తీవ్రత కనిపించింది. సిరాజ్‌తో కలిసి బౌలింగ్ దాడిని ఆరంభించిన బుమ్రా.. క్రాలీ (22)కి సమస్యలు సృష్టించాడు. భారత్‌కు వికెట్ దక్కడానికి ఎంతో సమయం పట్టలేదు. అయిదో ఓవర్లోనే డకెట్‌ను ఔట్ చేయడం ద్వారా సిరాజ్.. ఇంగ్లాండ్ పతనాన్ని ఆరంభించాడు. సిరాజ్ బంతిని పుల్ చేయబోయిన డకెట్ (12).. మిడాన్‌లో బుమ్రాకు చిక్కాడు. వికెట్ దక్కిన ఆనందంలో డకెట్‌ను చూస్తూ సిరాజ్ గట్టిగా అరిచాడు. డకెట్ అతణ్ని చూడకుండా వెళ్లిపోయాడు.. అంపైర్లు బౌలర్‌తో ఏదో మాట్లాడారు. సిరాజ్ కాసేపటి తర్వాత ఓలీ పోప్ (4)నూ ఔట్ చేసి భారత్‌ను సంబరాల్లో ముంచెత్తాడు. లోపలికి సీమ్ అయిన బంతికి పోప్ వికెట్ల ముందు దొరికిపోయాడు. తొలి ఇన్నింగ్స్‌లో రెండు వికెట్లు పడగొట్టిన నితీశ్‌కుమార్ రెడ్డిని బుమ్రా స్థానంలో బౌలింగ్‌కు దించాడు కెప్టెన్ గిల్. నితీశ్ తన రెండో ఓవర్లోనే ఫలితాన్నిచ్చాడు. అతడి ఫుల్ డెలివరీని డ్రైవ్ చేయబోయిన క్రాలీ.. ఎడ్జ్‌తో జైస్వాల్ చేతికి చిక్కాడు. క్రాలీ తొలి ఇన్నింగ్స్‌లోనూ నితీశ్ బౌలింగ్‌లోనూ ఔటయ్యాడు. 50/3తో ఇంగ్లాండ్ చిక్కుల్లో పడగా... బ్రూక్ (23)తో కలిసి రూట్ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. ఇద్దరూ ఇన్నింగ్స్ నిర్మించే ప్రయత్నం చేశారు. ఎటాకింగ్ గేమ్ ఆడిన బ్రూక్ చకచకా బౌండరీలు బాదాడు. కానీ ఈ భాగస్వామ్యం ఎంతో సేపు సాగలేదు. విరామానికి కాసేపటి ముందు బ్రూక్‌ను ఆకాశ్‌దీప్ ఔట్ చేసి ఇంగ్లాండ్‌ను దెబ్బతీశాడు. స్ట్రెయిట్‌గా వచ్చిన ఫుల్ డెలివరీని స్వీప్ చేసే ప్రయత్నంలో అతడు బౌల్డయ్యాడు.

#### తిప్పేసిన సుందర్

రూట్, స్టోక్స్ క్రీజులో పాతుకుపోయారు. భారత బౌలర్లను పరీక్షిస్తున్నారు. ఎలాంటి రిస్క్‌లకు పోకుండా ప్రశాంతంగా బ్యాటింగ్ చేస్తూ పరుగులు రాబడుతున్నారు. చిన్న అవకాశం కూడా ఇవ్వట్లేదు. అప్పుడప్పుడు బంతి అనూహ్యంగా వస్తున్నా.. బ్యాటర్లు క్రీజులో సౌకర్యంగానే కదులుతున్నారు. స్పిన్నర్లు, పేసర్లను సమర్థంగా ఎదుర్కొంటున్నారు. క్రమంగా ఇంగ్లాండ్ స్కోరు 150 దాటింది. ఆ జట్టు మంచి స్కోరుపై కన్నేసింది. లంచ్ తర్వాత పరిస్థితి ఇది. పరిస్థితి భారత్‌కు ప్రతికూలంగా మారుతున్నట్లనిపించిన వేళ.. వికెట్ పోకుండానే ఆ జట్టు సెషన్‌ను ముగిస్తుందేమో అనిపించింది. కానీ వాషింగ్టన్ సుందర్ మ్యాచ్ గమనాన్ని మార్చేశాడు. అద్భుత బౌలింగ్‌తో చకచకా వికెట్లు పడగొట్టి టీమ్‌ఇండియాకు ఊపునిచ్చాడు. ముందు అతడు రూట్‌ను ఔట్ చేయడం ద్వారా ప్రమాదకర భాగస్వామ్యాన్ని విడదీశాడు. సుందర్ బంతిని స్వీప్ చేయడంలో విఫలమై రూట్ బౌల్డ్ కావడంతో 67 పరుగుల అయిదో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. భారత్‌కు అత్యవసరమైన వికెట్ అది. సుందర్ కాసేపటి తర్వాత వికెట్‌కీపర్ బ్యాటర్ జేమీ స్మిత్ (8)ను కూడా బౌల్డ్ చేశాడు. స్మిత్ ఈ సిరీస్‌లో కీలక సమయంలో కీలక ఇన్నింగ్స్‌లతో భారత్‌ను విసిగించిన సంగతి తెలిసిందే. కాస్త ఆలస్యమైనా రెండు వికెట్లు దక్కడంతో టీమ్‌ఇండియా సంతృప్తిగానే టీ విరామానికి వెళ్లింది. విరామం తర్వాత స్టోక్స్ (33)ను సుందర్ బౌల్డ్ చేయగా.. ఆ తర్వాతి ఓవర్లోనే కార్స్ (1)ను బుమ్రా ఔట్ చేశాడు. బుమ్రా తన తర్వాతి ఓవర్లో వోక్స్ (10)ను వెనక్కి పంపాడు. బషీర్ (2)ను సుందర్ ఔట్ చేయడంతో ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌కు తెరపడింది. సుందర్ ఔట్ చేసిన నలుగురూ బౌల్డే కావడం విశేషం. ఇంగ్లాండ్ 38 పరుగుల వ్యవధిలో చివరి ఆరు వికెట్లు చేజార్చుకుంది.



www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

ప్రముఖ నటుడు కోట శ్రీనివాసరావు (83) కన్నుమూశారు. గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం తెల్లవారుజామున ఫిల్మ్‌నగర్‌లోని నివాసంలో తుదిశ్వాస విడిచారు. 1942 జులై 10న కృష్ణాజిల్లా కంకిపాడులో కోట శ్రీనివాసరావు జన్మించారు. 1968లో రుక్మిణిని వివాహం చేసుకున్నారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. కోట శ్రీనివాసరావు కుమారుడు కోట ప్రసాద్ 2010 జూన్ 21న రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. సినిమాల్లోకి రాక ముందు కోట శ్రీనివాసరావు స్టేట్ బ్యాంకులో పనిచేశారు. తెలుగుతో పాటు, తమిళం, హిందీ, కన్నడ చిత్రాల్లో కూడా నటించారు. ఆయన నట జీవితంలో తొమ్మిది నంది పురస్కారాలు అందుకున్నారు. ప్రతిఘటన (1985) (స్పెషల్ జ్యూరీ), గాయం (1993), తీర్పు (1994), లిటిల్ సోల్జర్స్ (1996), గణేష్ (1998), చిన్న (2000), పెళ్లైన కొత్తలో (2006), ఆ నలుగురు (2004), పృథ్వీ నారాయణ(2002) చిత్రాలకు నంది అవార్డులు అందుకున్నారు. 2012లో 'కృష్ణం వందే జగద్గురుమ్' సినిమాకు సైమా అవార్డు అందుకున్నారు. 2015లో అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు. 1999-2004 వరకు విజయవాడ తూర్పు నియోజకవర్గ భాజపా ఎమ్మెల్యేగా పనిచేశారు. దర్శక నిర్మాత క్రాంతికుమార్.. వెండి తెరపై కోట శ్రీనివాసరావుకు తొలి అవకాశం ఇచ్చారు. 1978లో 'ప్రాణం ఖరీదు'తో సినీరంగంలోకి అడుగుపెట్టారు. నాలుగు దశాబ్దాల సినీ ప్రయాణంలో ఎన్నో విలక్షణ పాత్రలు పోషించారు. 750కి పైగా చిత్రాల్లో నటించారు.



# కోట శ్రీనివాసరావు కాలధర్మం

సినీ ప్రముఖులు, అభిమానుల కన్నీటి వీడ్కోలు మధ్య ప్రముఖ నటుడు కోట శ్రీనివాసరావు అంత్యక్రియలు ముగిశాయి. ఫిల్మ్‌నగర్‌లోని ఆయన నివాసం నుంచి మహాప్రస్థానం వరకు అంతిమ యాత్ర జరిగింది. ఇందులో అభిమానులు పాల్గొని నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యుల సమక్షంలో పెద్ద మనవడు శ్రీనివాస్ అంతిమ సంస్కారాలు చేశారు. తన విలక్షణ నటనతో తెలుగు సినీ ప్రియులకు చేరువైన కోట శ్రీనివాసరావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలిసిందే. ఈ రోజు ఉదయం ఫిల్మ్‌నగర్‌లోని తన నివాసంలో ఆయన కన్నుమూశారు. పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు కోట శ్రీనివాసరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

## ప్రధాని మోదీ సంతాపం



ప్రముఖ నటుడు కోట శ్రీనివాసరావు మృతి పట్ల ప్రధాని నరేంద్రమోదీ సంతాపం తెలిపారు. ఆయన మరణం బాధాకరమన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. "కోట శ్రీనివాసరావు గారి మరణం బాధాకరం. సినిమా పట్ల ఆయనకు ఉన్న ప్రతిభ, బహుముఖ ప్రజ్ఞతో ప్రేక్షకులకు ఎప్పటికీ గుర్తుండిపోతారు. తన అద్భుతమైన ప్రదర్శనలతో కొన్ని తరాల ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. సామాజిక సేవలో ముందు ఉండటమే కాకుండా పేదల అభ్యున్నతి కోసం కృషి చేశారు. ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. ఓం శాంతి" అని ప్రధాని మోదీ పోస్ట్ పెట్టారు.





## అరుదైన నటన కోట శ్రీనివాసరావు సొంతం

**: ఏపీ సీఎం చంద్రబాబు**

ప్రముఖ సినీనటుడు కోట శ్రీనివాసరావు పార్థివదేహానికి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నివాళి అర్పించారు. ఫిల్మ్‌నగర్‌లోని నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ.. కోట శ్రీనివాసరావు మృతి చాలా బాధాకరమన్నారు. సినీపరిశ్రమకు ఎనలేని సేవలందించారని కొనియాడారు. నటన అంటే ఏవిధంగా ఉండాలో.. 40 ఏళ్ల పాటు నటించి చూపించారన్నారు. "ఆయనతో నాకు సన్నిహిత సంబంధం ఉంది. 1999లో నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎన్డీయే కూటమి నుంచి భాజపా తరఫున ఎమ్మెల్యే అయ్యారు. ఎంతో ప్రజాసేవ చేశారు. ఆయన ఒకే సీన్‌లో ఏడిపించగలరు, భయపెట్టగలరు. అలాంటి అరుదైన నటన కోట సొంతం. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, హిందీ భాషల్లో కలిపి దాదాపు 750 సినిమాల్లో నటించారు. పద్మశ్రీ, 7 నంది అవార్డులు రావడానికి ఆయన కృషి, ప్రతిభే కారణం. కోట శ్రీనివాసరావు ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నా. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా" అని చంద్రబాబు తెలిపారు.

## కోట శ్రీనివాసరావు జీవితంలో కోల్పోయినవి ఆ రెండే..



హైదరాబాద్: విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు లేరనే వార్త చిత్ర పరిశ్రమతో పాటు, యావత్ తెలుగు ప్రేక్షకులను దిగ్భ్రాంతికి గురి చేసింది. వందల సినిమాల్లో వైవిధ్యమైన పాత్రలతో అలరించిన ఆయన ఆదివారం తుది శ్వాస విడిచారు. సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు ఆయన మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. 40ఏళ్ల సుదీర్ఘ సినీ కెరీర్ కలిగిన ఆయన తన జీవితంలో కోల్పోయిన విషయాలు రెండే రెండు ఉన్నాయని ఓ సందర్భంలో గుర్తు చేసుకుని బాధపడ్డారు. "నా మొత్తం జీవితంలో కోల్పోయిన విషయాలు రెండున్నాయి. ఒకటి సరైన సమయంలో కుటుంబంతో గడపలేకపోయాను. షూటింగ్స్ ఉండి నెలకో, రెండు నెలలకో ఓసారి ఇంటికి వచ్చిన సందర్భాలున్నాయి. నాకు ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు. పిల్లల చిన్నతనంలో వారి అచ్చటా ముచ్చట పెద్దగా చూసుకుంది లేదు. వారి వెనకాల ఉండి నడిపించింది లేదు. నా అదృష్టం ఏంటంటే పిల్లలు చదువుకుని, బుద్ధిమంతులయ్యారు. ఇక రెండోది- జనరల్ నాలెడ్జ్ లేకుండా పోయింది. పొద్దున్న ఐదింటికో, ఆరింటికో వెళ్లిపోయేవాడిని. తిరిగి వచ్చేసరికి అర్ధరాత్రి దాటి ఏ రెండో అయ్యేది. ప్రపంచంలో ఏం జరుగుతుందనేది కూడా పట్టించుకోలేదు. ఈ రెండింటి గురించి తలుచుకొని నాలో నేను ఏడుస్తూ ఉంటాను. నా జీవితం ఎలా అయిపోయిందంటే అప్పుడు తినడానికి టైమ్ లేదు. ఇప్పుడు తిందామంటే తినలేను. అప్పట్లో ఎవరు ఏం చేసేవారో కూడా తెలిసేది కాదు. పుట్టినరోజులు, పెళ్లిరోజులు.. ఏవీ పట్టేవి కావు. ఎవరికైనా టైమ్ వస్తే టైమ్ ఉండదని అర్థమైంది. ఆ రోజులు అలా గడిచిపోయాయి" "నా కొడుకు మరణం నాకు చాలా పెద్ద దెబ్బ. ఎంతో బాధను మిగిల్చింది. ఆత్రేయగారు అన్నట్టు.. 'అనుకున్నామని జరగవు అన్నీ.. అనుకోలేదని ఆగవు కొన్ని' జీవితం వెళ్లిపోయింది.. వెళుతోంది.. ఈ వయసులో పితృశోకం భరించవచ్చు. పుత్ర శోకం భరించలేం. తండ్రిగా ఆ బాధను అనుభవిస్తున్నాను. ఈ దుఃఖాన్ని ఎవరూ పూడ్చలేరు. దేవుడు ఈ కష్టం ఇచ్చాడని ఏడుస్తూ కూర్చుంటే నన్ను నమ్ముకున్నవారు ఉన్నారు. వాళ్లేమై పోతారు. ఎలాగూ తప్పదు కాబట్టి.. నడిపించాలి అంతే" అని పొంగి వస్తున్న దుఃఖాన్ని ఆపుకొంటూ కోట బాధపడ్డారు.

## ప్రముఖుల సంతాపం

### కోట శ్రీనివాసరావు మృతి సినీ రంగానికి తీరని లోటు : రేవంత్‌రెడ్డి

కోట శ్రీనివాసరావు మృతి పట్ల తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన విలక్షణ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారని తెలిపారు. ఆయన మృతి సినీ రంగానికి తీరని లోటు అని పేర్కొన్నారు. కోట శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

### మంచి సంస్కారం కలిగిన నటుడిని కోల్పోయాం: వెంకయ్యనాయుడు

ప్రముఖ నటుడు కోట శ్రీనివాసరావు మరణం చాలా బాధాకరమని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. కోట భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. "ఆయన విలక్షణ నటుడు, మానవతావాది. వందలాది సినిమాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించారు. శాసనసభ్యుడిగా ఎన్నికై ప్రజలకు సేవ చేశారు. కుమారుడి అకాల మరణంతో కోట బాగా కుంగిపోయారు. మంచి సంస్కారం కలిగిన నటుడిని కోల్పోయాం. కోట శ్రీనివాసరావు ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నా" అని వెంకయ్యనాయుడు తెలిపారు.

### తెలుగు భాష.. యాస తెలిసిన నటుడు: పవన్‌కల్యాణ్

"తెలుగు చిత్ర పరిశ్రమలో విలక్షణమైన నటనకు చిరునామాగా నిలిచిన కోట శ్రీనివాసరావు తుది శ్వాస విడిచారని తెలిసి తీవ్ర ఆవేదనకు లోనయ్యాను. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. తెలుగు తెరపై ప్రతినాయకుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా విభిన్నమైన పాత్రలు పోషించారు. తెలుగు భాష... యాసలపై ఆయనకు మంచి పట్టు ఉంది. ఓ పిసినారిగా, ఓ క్రూరమైన విలన్‌గా, ఓ మధ్య తరగతి తండ్రిగా, ఓ అల్లరి తాతయ్యగా.. ప్రతి పాత్రలో ఒదిగిపోయారు. నా మొదటి చిత్రం 'అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి..'లో ఆయన ముఖ్యమైన పాత్రలో ప్రేక్షకులను అలరించారు. ఆ తర్వాత పలు సినిమాల్లో కలిసి నటించాం. కోట శ్రీనివాసరావు డైలాగ్ చెప్పే విధానం, హావభావాలు ప్రేక్షకులను కట్టిపడేస్తాయి. ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను"

### విభిన్న పాత్రలను పోషించిన విలక్షణ వెండితెర నటుడు : కేసీఆర్

కోట శ్రీనివాసరావు మృతికి మాజీ సీఎం, భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు కేసీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన విభిన్న పాత్రలను పోషించిన విలక్షణ వెండితెర నటుడు అని తెలిపారు. ప్రేక్షక హృదయాల్లో తన స్థానాన్ని పదిలపరుచుకున్నారని చెప్పారు. కోట మరణంతో సినీరంగం ఒక గొప్ప నటుడుని కోల్పోయిందన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కోట శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

### పాత్ర ఏదైనా ఆయన మాత్రమే చేయగలడు : చిరంజీవి

"లెజెండరీ యాక్టర్, బహుముఖ ప్రజ్ఞాశాలి కోట శ్రీనివాసరావు ఇక లేరనే వార్త ఎంతో కలచివేసింది. 'ప్రాణం ఖరీదు' తో ఆయన నేనూ ఒకేసారి సినిమా కెరీర్ ప్రారంభించాం. ఆ తర్వాత వందల కొద్దీ సినిమాల్లో ఎన్నెన్నో విభిన్నమైన పాత్రల్లో నటించి, ప్రతి పాత్రని తన విలక్షణ, ప్రత్యేక శైలితో అలరించి తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చిర స్థాయిగా నిలిచిపోయారు. కామెడీ, విలన్, సపోర్టింగ్ క్యారక్టర్ ఇలా ఏ పాత్ర అయినా తను మాత్రమే చేయగలడన్న గొప్పగా నటించారు. ఇటీవల ఆయన కుటుంబంలో జరిగిన వ్యక్తిగత విషాదం ఆయన్ని మరింత మానసికంగా కుంగదీసింది. కోట శ్రీనివాసరావులాంటి నటుడు లేని లోటు చిత్ర పరిశ్రమకి, సినీ ప్రేమికులకి ఎన్నటికీ తీరనిది. ఆయన ఆత్మకి శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా"

### సినీ పరిశ్రమ 'కోట' కూలిపోయింది: తనికెళ్ల భరణి

కోట శ్రీనివాసరావు పార్థివదేహానికి.. నటుడు తనికెళ్ల భరణి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కోట శ్రీనివాసరావుతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సినీ పరిశ్రమ 'కోట' కూలిపోయిందన్నారు. ఆయనతో వ్యక్తిగతంగా దశాబ్దాలకు పైగా పరిచయం ఉందని చెప్పారు. సామాన్య మధ్యతరగతిలో పుట్టి అంచలంచెలుగా సినీ శిఖరంగా ఎదిగిన ఆయన ప్రస్థానం ఎంతో స్ఫూర్తిదాయకమని తెలిపారు. వేసిన ప్రతి వేషం సంపూర్ణ నటుడిగా ఆయనకు గుర్తింపు తెచ్చిందని వివరించారు. నాటకాలు అంటే కోట శ్రీనివాసరావుకు ఎనలేని ఆసక్తి అని.. అదే సినీ రంగ ప్రవేశానికి పునాది వేసిందని గుర్తుచేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు.

"కోట శ్రీనివాసరావు గారు.. ఆ పేరే చాలు. ఎనలేని నటనా చాతుర్యం. ప్రతి పాత్రకు తనదైన శైలిలో ప్రాణం పోసిన మహానటుడు. నా సినీ ప్రయాణంలో ఆయనతో నటించిన, పంచుకున్న క్షణాలు ఎప్పటికీ చిరస్మరణీయం. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా"

– ఎన్టీఆర్

"కోట శ్రీనివాసరావుగారి మరణ వార్త నన్నెంతో కలచివేసింది. నటనలో నిష్ణాతుడు, పోషించిన ప్రతి పాత్రకు ప్రాణం పోసిన లెజెండ్. ఆయన కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతి.

– రాజమౌళి

"సినీ రంగంలో ఉన్న అతి కొద్దమంది గొప్ప నటుల్లో కోట శ్రీనివాసరావు ఒకరనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆయన నటనతో నా సినిమాలు 'శివ', 'గాయం', 'మనీ', 'సర్కార్', 'రక్త చరిత్ర' మరింత ప్రభావవంతంగా వచ్చాయి. కోట శ్రీనివాసరావు గారు మీరు ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోయి ఉండవచ్చు. కానీ, మీ పాత్రలు బతికే ఉంటాయి"

– దర్శకుడు రాంగోపాల్‌వర్మ

Printed, Published and Owned by RAVU RAJITHA, Printed at KAKATHIYA PRINTERS, LN Colony, Uppal IDA, Uppal. Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, RNI NO : TELTEL/2024/86684, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com